13-04-2024
శనివారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 294
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8| మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు: 140



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.




## బిజెపిని ఓడించడానికి ప్రజలు సిద్ధం

### సమాజ్‌వాది చీఫ్ అఖిలేశ్ యాదవ్

**పిలిభిత్:** బిజెపిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సమాజ్‌వాదపార్టీ చీఫ్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. పిలిబిత్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థి భగవత్ శరణ్ గంగ్వార్ తరపున శుక్రవారం ఇక్కడ ప్రచారం నిర్వహించిన అఖిలేశ్, ఓ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల ఆందోళన ఉధృతం కావడంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో మూడు సాగు చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని వ్యాఖ్యానించారు. అదే విధంగా ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్ (ఇబిఎస్)ను రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీం కోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇబిఎస్, పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలు నల్ల ధనాన్ని 'వైట్''గా మారచడానికి ఉద్దేశించినవి కావా? అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతులను దెబ్బకొట్టి, కార్పొరేట్ రంగానికి ప్రాధాన్యమిచ్చేలా సిద్ధం చేసిన సాగు చట్టాలను సమర్ధించిన వారికి బిజెపి నుంచి గౌరవం లభిస్తున్నదని అఖిలేశ్ విమర్శించారు. పిలిబిత్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న బిజెపి అభ్యర్థి జితన్ ప్రసాదను ఉద్దేశించి కూడా ఆయన వ్యాఖ్యలు చేశారు. 'తాను ఇక్కడ నుంచి కాకుండా ముంబయి నుంచి పోటీ చేసి ఉండాల్సిందనే విషయం జితన్‌కు తెలుసు. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా అంగీకరించారు కూడా. ఇలాంటి వ్యక్తి నియోజవర్గానికి న్యాయం ఎలా చేస్తారు' అని నిలదీశారు. ఈనెల మొదటి వారంలో ఇక్కడ జరిగిన ఒక బహిరంగ సభలో జితిన్ మాట్లాడుతూ తాను పిలిబిత్ నుంచి పోటీ చేస్తానని ఎన్నడూ అనుకోలేదని అన్నారు. దీనికి బదులు తాను ముంబయి నుంచి పోటీనే కోరుకుంటానని స్పష్టం చేశారు.ఆ మాటలను అఖిలేశ్ గుర్తుచేశారు. బిజెపిని పిలిబిత్ ప్రజలువ ఓడిస్తారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగిన జితన్ 2021లో బిజెపిలో చేరారు.

# తక్కువ ధరకు ధాన్యం కొంటే... ఉపేక్షించేదిలేదు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



తాగునీటి కోసం కర్నాటకతో సంప్రదింపులు

ప్రజాపక్షం / హైదరాబాద్

రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సిఎం ఆదేశించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అందుకే ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని ముఖ్యమంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు. నేరుగా కళ్లాల నుంచి వడ్లను మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఒకటి రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సిఎం సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కనీస మద్దతు ధర అమలు జరిగే విధంగా చూడాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రతి రోజూ రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పలు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఎఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సిఎం సూచించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సిఎం ఆదేశించారు.

**తప్పుడు కథనాలపై ఇసికి ఫిర్యాదు చేయాలి**

ఎన్నికల సమయం కావడంతో కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రానున్న రెండు

తరువాయి 2లో



## మూడు రోజులు సిబిఐ కస్టడీకి కవిత

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం అవినీతి కేసులో తెలంగాణ శాసనమండలి సభ్యురాలు కె.కవిత (46) ను సిబిఐ తన కస్టడీలోకి తీసుకుంది. ఆమెను విచారణ జరిపేందుకు ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు సిబిఐకి అనుమతి మంజూరు చేసింది. న్యూఢిల్లీ రౌస్ ఎవెన్యూలోని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15వ తేదీ వరకూ కవిత మూడు రోజుల పాటు సిబిఐ కస్టడీలో ఉంటారు. తీహార్ జైలులో ఉంటున్న కవితను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజు విధానాన్ని ముందుగానే సంబంధిత వ్యాపారులకు తెలియజేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ రాష్ట్ర అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి సౌత్ గ్రూపు ద్వారా రూ.100 కోట్లు ముడుపులు చెల్లించడంలో కవిత కీలక సూత్రధారిగా వ్యవహరించారన్నది ప్రధాన ఆరోపణ. లెక్కల్లో చూపించకుండా నిధులను అక్రమ చేతులు మార్చారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తొలుత ఆమెను అరెస్టు చేసింది. సిబిఐ తాజాగా రంగంలోకి దిగి లంచం కేసులను విచారిస్తున్నది. ఐపిసి సెక్షన్ 120—బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 477—ఎ అకౌంటు పుస్తకాల్లో అంకెలను తారు మారు చేయడం) సెక్షన్—7 (ప్రభుత్వ ఉద్యోగులను లంచగొండులుగా మార్చడం) కింద కవితపై కేసులు నమోదుచేసి సిబిఐ అరెస్టు చేసింది. మార్చి 15వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని

తరువాయి 2లో

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి



ప్రజాపక్షం/సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు ఫ్లై ఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు అక్కడిక్కడే మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేటకు చెందిన మహ్మద్ నబీద్ కొద్ది రోజుల్లో న్యూజిలాండ్‌కు వెళ్తుండగా రంజాన్ పండుగ సందర్భంగా తన మిత్రులకు విందు ఏర్పాటు చేశారు. జనగాం క్రాస్ రోడ్డు నుండి తిరిగి వారు కారులో ఇంటికి వస్తుండగా ఖమ్మం క్రాస్ రోడ్డులోని ఫ్లై ఓవర్ పై ఆగి ఉన్న డిసిఎంను వెనుక నుండి వేగంగా ఢీకొట్టడంతో మహ్మద్ నబీద్ (26), వెన్న నిఖిల్ రెడ్డి (25), గుండగాని రాకేష్ (26)లు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందగా, చందుకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని

తరువాయి 2లో

## త్వరలో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన!

### మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారీ రాజకీయ కుట్ర చేస్తోందని ఢిల్లీ క్యాబినెట్ మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి చేసిన రాజకీయ కుట్రలో భాగమే ఆయన అరెస్టు అని అన్నారు. రానున్న రోజుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించనున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందన్నారు. అయితే ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడం చట్టవిరుద్ధమని, ప్రజల మనోభావాలకు విరుద్ధమన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవలి కాలంలో దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశాన్ని సూచించే అనేక ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా ఢిల్లీలో సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించలేదని ఆరోపించారు. డిపార్ట్‌మెంట్లలో పోస్టులు ఖాళీగా ఉన్నాన్నా పోస్టింగ్‌లు జరగలేదు, మోడల్ ప్రవర్తనా నియమావళిని ఉటంకిస్తూ మంత్రులు పిలిచినా బ్యూరోక్రాట్లు సమావేశాలకు హాజరుకావడం మానేశారు, లెఫ్టినెంట్ గవర్నర్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖలు రాస్తున్నారన్నారు. ఢిల్లీలో అధికారంలోకి రాలేమని బిజెపికి ముందే తెలుసునని ఆతిశీ అన్నారు. '2015, 2020లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ బిజెపిని ఓడించింది. అందుకే ఢిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు. అయితే, ఢిల్లీ ప్రభుత్వానికి మెజారిటీ ఉన్నందున రాష్ట్రపతి పాలన విధించడం చట్టవిరుద్ధం. ఈ ఏడాది ఫిబ్రవరి 17న జరిగిన ఫ్లోర్ టెస్ట్'లో మేము

తరువాయి 2లో

## ఇండియా కూటమికి అంతర్లీనంగా అనుకూల వాతావరణం

### ఆ భయంతోనే ప్రధాని మోడీ విస్తృత ప్రచారం

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే





**న్యూఢిల్లీ :** వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి అంతర్లీనంగా అనుకూల వాతావరణం నెలకొని ఉన్నదని, అందుకే ప్రధాని నరేంద్ర మోడీ భయంతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. నల్లధనం తీసుకువచ్చి ప్రతి పౌరుడికి రూ.15 లక్షలు ఇచ్చానని, రైతుల ఆదాయం రెండింతలైందని, రెండు కోట్ల ఉద్యోగాలిచ్చామని, రైతులకు కనీస మద్దతు ధర కల్పించామని అయోధ్య దేవాలయంలోని బాలరాముని విగ్రహంపై మోడీ ప్రమాణం చేయగలరా? అని సవాలు విసిరారు. ప్రధాని నిత్యం దేవుడి పేరును వల్లె వేస్తారని, పేదలను ధరల పెరుగుదల కింద నలిపేస్తారని విమర్శించారు. గతంలో ఖర్గే ప్రాతినిధ్యం వహించిన కర్నాటకలోని కలబురిగి నియోజకవర్గం నుండి ఆయన అల్లుడు రామకృష్ణ దొడ్డమణి శుక్రవారం నాడు నామినేషన్ దాఖలు చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మల్లిఖార్జున ఖర్గే ప్రసంగిస్తూ పేద ప్రజలు జీవించగలుగుతున్నారంటే అందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీలే కారణమని అన్నారు. ఇటీవల మోడీ విస్తృతంగా ఎందుకు పర్యటిస్తున్నారంటే , ఇండియా కూటమికి అనుకూలంగా అంతర్లీన వాతావరణం ఉన్నదని చెప్పారు. అందుకే ఇరుకు సందులు కూడా వెళ్ళి ప్రధాని రోడ్ షోలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇడి,

తరువాయి 8లో



## మాజీ సిఎం కెసిఆర్ ఫాంహౌస్ ముట్టడి

### డబుల్ బెడ్‌రూమ్ బాధితుల నిరసన

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్/గజ్వేల్

ఎర్రవెల్లిలోని మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు ఫాంహౌస్‌ను డబుల్ బెడురూమ్‌ల లబ్ధిదారులు ముట్టడించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్మించిన 1100 డబుల్ బెడురూమ్‌ల ఇండ్ల కోసం లక్కీ డ్రా ద్వారా గత సంవత్సరం లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయినప్పటికీ వారికి ఇంతవరకు ఇండ్లు కేటాయించలేదు. పలు మార్లు లబ్ధిదారులు తమకు ఇండ్లు వెంటనే కేటాయించాలని గజ్వేల్‌లో నిరసనలు చేపట్టారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో గజ్వేల్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా నిలదీసి తమకు ఇండ్లు కేటాయించాలని కోరారు. అయినప్పటికీ లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపులో అప్పటి ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబించింది. దీంతో శుక్రవారం కొంతమంది డబుల్ బెడురూమ్‌ల లబ్ధిదారులు మర్కూక్ మండలంలోని మాజీ సిఎం ఫాంహౌస్ వద్దకు చేరుకొని ప్రధాన గేట్ ముందు నిరసన వ్యక్తంచేశారు. ఫాంహౌస్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గేట్ ముందే లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. దీంతో లబ్ధిదారులకు, పోలీసుల మధ్య కొంతసేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. లబ్ధిదారులు మాట్లాడుతూ మూడు సార్లు కెసిఆర్‌కు ఓట్లేసి గెలిపించినా తమ గోడును పట్టించుకోలేదని

తరువాయి 2లో

# డైలమాలో గులాబీ శ్రేణులు

క్యాడర్‌లో ఫోన్ ట్యాపింగ్, లిక్కర్' ప్రభావం

వేచిచూసే ధోరణిలో నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌కు వరుస దెబ్బలు తగులుతున్న నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణుల్లో డైలమా నెలకొన్నది. ఒక వైపు అధికారం కోల్పోవడంతో ముఖ్యనాయకులు ''కారు''దిగడం, మరోవైపు ఆ పార్టీ ముఖ్యులు పలు కేసుల్లో చిక్కుకోవడం

తరువాయి 2లో



వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ బిఆర్‌ఎస్ అభ్యర్థిగా హన్మకొండ జెడ్‌పి చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ పేరును ఆ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుక్రవారం ఖరారు చేశారు. వరంగల్ అభ్యర్థి ఖరారు అంశంపై వరంగల్ జిల్లా నాయకులతో కెసిఆర్ తన ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురితో చర్చించిన కెసిఆర్ వరంగల్ ఎంపి అభ్యర్థిగా మారేపల్లి సుధీర్ కుమార్ పేరును నిర్ణయించారు. అయితే వరంగల్ ఎంపిగా ఇది వరకే స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి కమార్తె డాక్టర్ కడియం కావ్య పేరును ప్రకటించగా, శ్రీహరితో పాటు ఆమె కూడా బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వరంగల్ లోక్‌సభ అభ్యర్థిపై పలువురి పేర్లు వినిపించగా చివరికి మాజీ ఎంఎల్‌ఎ తాటికొండ రాజయ్యకు ఎంపి అభ్యర్థిగా ప్రకటిస్తారని ప్రచారం జరిగింది.

# పది రోజులు దాటినా ఒక్క గింజ కొనలే!

'కరీంనగర్‌లో' 341 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఫలితం శూన్యం

అధికారుల పర్యవేక్షణ లోపం

దళారుల వైపే మొగ్గు చూపుతున్న రైతులు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించేందుకు రైతన్నకు ప్రతియేడు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వాలు రైతుల కోసం ముందస్తుగా ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. కరీంనగర్ జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 2.67 లక్షల ఎకరాలలో వరి సాగు చేసిన ధాన్యానికి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని సంబంధిత పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు 341 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి పది రోజులు దాటినా ఇప్పటి వరకు ఒక్క ధాన్యం గింజ కొనుగోలు చేసిన దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడిందా? రైస్ మిల్లర్ల అత్యుత్సాహం పెరిగిందా? దళారులుగా చెప్పుకునే కొందరు మిల్లర్లు అజమాయిషీ చేస్తున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా రైతులకు కన్నీరే మిగులుతోంది. జిల్లాలో ఈ యేడాది గతానికి భిన్నంగా రైతన్న సాగు చేసిన వరిపంటకు చీడపీడలకు తోడు ఆయకట్టు సాగు నీరందక ఎండిపోవడం, అకాల వర్షాలకు దెబ్బతిని నష్టపోవడంతో పంటను రక్షించుకునేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఎన్నో

తరువాయి 2లో

# ఇజ్రాయిల్‌పై దాడికి తొందరపడం : ఇరాన్

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత



**టెహ్రాన్ :** ఇజ్రాయిల్‌ను శిక్షించడం ఖాయమని, ఐతే తొందర పాటు నిర్ణయం మాత్రం తీసుకోబోమని ఇరాన్ శుక్రవారంనాడు స్పష్టంచేసింది. సిరియా డమాస్కస్‌లో ఇరాన్ దౌత్యకార్యాలయంపై ఇజ్రాయిల్ దాడి చేసిన తర్వాత ఇరాన్ సర్వాధినేత ఆయుతొల్లా ఖొమైనీ చేసిన హెచ్చరికతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఏ క్షణంలోనైనా ఇరాన్ దాడులు చేస్తుందన్న వార్తలతో ఇజ్రాయిల్ కూడా సన్నద్ధమైంది. తాము అప్రమత్తంగా ఉన్నామనీ, ఐతే హై ఎలర్ట్ ప్రశ్నేలేదని ఇజ్రాయిల్ పేర్కొంది. ఐక్య రాజ్యసమితి రంగంలోకి దిగి ఇజ్రాయిల్‌ను అదుపుచేస్తే తమకు అభ్యంతరం లేదని కూడా ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయిల్‌పై దాడి చేస్తామని, ఐతే అత్యంత బీభత్సంగా, ప్రపంచానికి పెను సమస్యలు సృష్టించేవిధంగా ఈ దాడులు ఉండబోవని కూడా స్పష్టత ఇచ్చింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం నాడు జపాన్ ప్రధానమంత్రి కిషిదాతో సమావేశం సందర్భంగా, ఇరాన్ దౌత్యకార్యాలయంపై దాడిలో తమ ప్రమేయం లేదని మరో సారి స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితుపై చైనా, టర్కీ, సౌదీఅరేబియా విదేశాంగమంత్రులతో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ చర్చలు జరుపుతున్నారు. ఇంకోవైపు ఇజ్రాయిల్ డిఫెన్స్‌ఫోర్స్ జనరల్స్ కూడా అత్యవసరంగా సమావేశం జరిపి వ్యూహ రచనలు చేస్తున్నారు. ఇరాన్ దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రతిదాడులు చేస్తామని ఇజ్రాయిల్ రక్షణమంత్రి యోల్ గాల్లంట్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని అమెరికా, రష్యాతోపాటు బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్ కూడా ఇరాన్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా హమాస్–ఇజ్రాయిల్ మధ్య సయోధ్య కుదిర్చి కాల్పుల విరమణ (తాత్కాలికంగా) చేయించేందుకు మధ్యవర్తులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇజ్రాయిల్ గురువారం ఉత్తరగాజాలో జరిపిన దాడిలో హమాస్ అగ్రశ్రేణి నాయకుడు ఇస్మాయిల్ హనియేహ్ ముగ్గురు కుమారులు, మరో నలుగురు మనవలు హతులయ్యారు. ఐతే హనియేహ్ ఒక ప్రకటన చేస్తూ తాము ఈ విషయంలో చింతించడంలేదని, కాల్పుల విరమణకే కట్టుబడి ఉన్నామని, ఈ ఘటన ఈ ప్రక్రియకు ఆటంకం కాదని పేర్కొన్నారు. ఈ యావత్ పరిణామాలు ఇలా ఉంటే, ఇజ్రాయిల్ సైన్యం శుక్రవారం ఉదయం నుండీ గాజా స్ట్రిప్‌లోనూ, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్, సెంట్రల్ గాజాలలో తన దాడులు కొనససాగిస్తున్నది. నుజెరాత్‌లో ఉన్న పాలస్తినా శిబిరంపై జరిపిన దాడిలో 70 మంది గాయపడ్డారు. ఈ దాడిలో టిఆర్‌టి అరబిక్ ఛానల్‌కు చెందిన జర్నలిస్టుతోపాటు ఇద్దరు జర్నలిస్టులు గాయపడ్డారు.

# పాలస్తినాను దేశంగా గుర్తించేందుకు యూరప్ సిద్ధం : స్పెయిన్ ప్రధాని పెడ్రో



**ఓస్లో :** పాలస్తినాను ఒక దేశంగా గుర్తించేందుకు యూరప్ సిద్ధంగా ఉందని స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ చెప్పారు. ఓస్లో పర్యటన సందర్భంగా నార్వే ప్రధానమంత్రి జోనస్ గహర్ స్టోర్‌తో సమావేశం సందర్భంగా శుక్రవారంనాడు పెడ్రో శాంచెజ్ మాట్లాడుతూ, పాలస్తినాను ఒక దేశంగా గుర్తించేందుకు యూరప్ సిద్ధంగా ఉందన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న చర్యలపై నాటో దేశాలు నోటి మాటగా ఖండించడం, పాలస్తినాకు గట్టి మద్దతు ఇవ్వడం అనూహ్యంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయన ఐర్లాండ్, పోర్చుగల్, స్లోవేనియా, బెల్జియం దేశాలలో కూడా పర్యటిస్తారని భావిస్తున్నారు. "గాజాలో మానవ విధ్వంసాన్ని నిలిపివేయాలని మేం కోరుకుంటున్నాం, తక్షణం శాంతి ప్రక్రియ ప్రారంభం కావాలి, రెండు దేశాలు శాంతియుతంగా జీవించే ఒక విధానం అమలులోకి రావాలి" అని పెడ్రో శాంఛెజ్ చెప్పారని స్పెయిన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి పిలార్ అలెగ్రియా చెప్పారు. పాలస్తినాను ఒక దేశంగా గుర్తించడం యూరప్ ప్రయోజనాలకోసమేనని బుధవారంనాడు శాంఛెజ్ వ్యాఖ్యానించారు. పాలస్తినా గనుక తను ఉనికిని తాను గుర్తించలేకపోతే అంతర్జాతీయ సమాజం చేసేదేమీ ఉండదని స్పెయిన్ పార్లమెంటులో ఆయన వ్యాఖ్యానించారు.

ప్రపంచం

# రాజకీయ అస్థిరతే పాక్ ఆర్థిక వ్యవస్థకు ఆటంకం : ఎడిబి



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ ఆర్థిక అభివృద్ధికి రాజకీయ అస్థిరతే అతిపెద్ద ఆటంకంగా ఉందని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) స్పష్టం చేసింది. ఈ ఏడాది పాకిస్థాన్ ఆర్థిక ముఖచిత్రం అనిశ్చితంగా ఉందని మనీలా కేంద్రంగా పనిచేస్తున్న ఎడిబి తన బులిటెన్ 'ఏసియన్ డవలప్‌మెంట్ ఔట్‌లుక్'లో నివేదిక ఇచ్చింది. ఆర్థిక సంస్కరణలు చేపట్టడానికి పాకిస్థాన్‌లో రాజకీయ స్థిరత్వం లేదని, అస్థిరత వెంటాడుతోందని పేర్కొంది. శక్తిమంతమైన సరఫరా వ్యవస్థకు భంగం కలిగిందని పేర్కొంది. వచ్చే ఏడాదినాటికి కొద్దిగా పాకిస్థాన్‌లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ అనుసరిస్తున్న స్థూల ఆర్థిక విధానాలు కీలకమైన సమస్యగా ఉందని,స్థిరమైన సంస్కరణల కృషికి ఇది ఆటంకమని పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్‌లో వృద్ధిరేటు 1.9 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. తర్వాత క్రమంగా 2.8 శాతానికి పెరుగుతుందని కూడా పేర్కొంది. రాజకీయస్థిరత్వం మీదే ఈ ప్రక్రియ ఆధారపడి ఉంటుందనిపేర్కొంది. ఈ దేశంలో ద్రవ్యోల్బణం 50 సంవత్సరాలుగా ఎన్నడూలేనంత అత్యధికస్థాయికి పెరిగిపోయిందని ఎడిబి నివేదిక వెల్లడించింది. రూపాయి విలువ కూడా గణనీయంగా దిగజారిపోయింది, దీంతో ఆహార వస్తువులు, ఇంధనం ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తెలియజేసింది. ఈ ఏడాది ఈ పరిస్థితి కొద్దిగా మెరుగుపడవచ్చేనని పేర్కొంది. ఈ ఏడాది ద్రవ్యోల్బణం 25 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. మధ్యాసియాలో యుద్ధ పరిస్థితులు పాకిస్థాన్ ఆర్థిక స్థితిని మరింతగా దిగజార్చే అవకాశం ఉందని కూడా ఎడిబి పేర్కొన్నట్లు ఆ దేశంలోని పత్రికలు వెల్లడించాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇస్తున్న మద్దతు ద్వారా పాకిస్థాన్‌లో మార్కెట్ గణనీయంగా పుంజుకునే అవకాశం ఉంటుందని వెల్లడించింది.

### కీలక సమస్యలు పరిష్కారం కావాలి : ఐఎంఎఫ్

పాకిస్థాన్‌కు రుణం మంజూరు చేయడంలో ఇంకా కీలక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది. గడచిన తొమ్మిది నెలలుగా ఆర్థికమంత్రిత్వశాఖసహా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ఐఎంఎఫ్‌తో పాకిస్థాన్ ప్రభుత్వం చర్చలు జరుపుతున్నది. మూడు బిలియన్ డాలర్లు రుణం కోసం పాకిస్థాన్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నది. ఈ కృషి ఫలిస్తే మొదటి విడతగా పాకిస్థాన్‌కు 1.5 బిలియన్ డాలర్లు రుణం లభిస్తుంది. పాకిస్థాన్‌లో ఇంకా కీలకమైన కొన్ని సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని అట్లాంటిక్ కౌన్సిల్ థింక్ ట్యాంక్‌తో గురువారం ఇస్లామాబాద్‌లో జరిగిన సమావేశంలో ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియోవా చెప్పారు.



# అవినీతి కేసులో వియత్నాం మహిళా వ్యాపార దిగ్గజం మైలాన్‌కు మరణశిక్ష



**హనోయ్ :** వియత్నాంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార దిగ్గజం ట్రూంగ్ మైలాన్‌కు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం మరణశిక్ష విధించింది. వియత్నాంలోని సైగాన్ జాయింట్ స్టాక్ కమర్షియల్ బ్యాంక్ (ఎస్‌సిబి)లో 304 ట్రిలియన్ డాంగ్ (వియత్నాం కరెన్సీ)ల మేరకు ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో ఆమెకు మరణశిక్ష విధించారు. దేశం నుండి అవినీతిని సమూలంగా నిర్మూలించాలన్న వియత్నాం కమ్యూనిస్టుపార్టీ ప్రధాన లక్ష్యం మేరకు అవినీతిపరులకు దేశంలో కఠిన శిక్షలు అమలు చేస్తున్నారు. వియత్నాంలో ఈ కేసు ఎంతో సంచలనం సృష్టించింది. ట్రూంగ్‌తోపాటు ఆమె భర్త, హాంకాంగ్‌కు చెందిన వ్యాపారవేత్త ఎరిక్ ఛూకు తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష పడింది. ఆదేవిధంగా ఆమె మేనకోడలుకు కూడా ఈ కేసులో 17 సంవత్సరాలలు జైలు శిక్ష పడింది. ట్రూంగ్ మైలాన్‌కు ఎస్‌సిబి లో భారీ ఎత్తున అత్యధికశాతంలో వాటాలు ఉన్నాయి. 2018%2022 మధ్యకాలంలో అక్రమ, నకిలీ పత్రాలు దాఖలు చేసిన మైలాన్ బ్యాంకు నుండి 12.5 బిలియన్ డాలర్ల (304 డాంగ్లు)ను విత్‌డ్రా చేశారని విచారణలో రుజువైంది. సుధీర్ఘమైన దర్యాప్తు అనంతరం మార్చి నెలలో ఈ కేసు విచారణ ప్రారంభమైంది. వియత్నాందేశంలో ఈ శతాబ్దంలోనే అత్యంత ఉత్కంఠభరితమైన కేసు విచారణగా ప్రజల దృష్టిని ట్రూంగ్ ఆకర్షించారు. ఎక్కడచూసిని ప్రజలు ట్రూంగ్ మైలాన్ అవినీతి గురించే చర్చించుకుంటూ ఎలాంటి తీర్పు వస్తుందా? అని ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారు. చివరకు ఆమెకు అత్యంత కఠినశిక్ష పడింది. వాన్‌థిన్ పాథ్ హోల్డింగ్స్ గ్రూప్ పేరుతో మైలాన్ ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ నిర్వహిస్తున్నారు. వియత్నాంలో ఒక పెద్ద వ్యాపారవేత్తగా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. 2019–2022 ఆమె కారు డ్రైవర్ లక్షల డాలర్లమేరకు సెంట్రల్ బ్యాంకు నుండి ఆమె ఇంటికి ధనాన్ని చేరవేశాడని విచారణలో వెల్లడైంది.

# రష్యా ప్రతీకార దాడి.. ఉక్రేన్ విద్యుత్ ప్లాంట్ దగ్ధం

కీవ్ : ఉక్రేన్‌లో ఉన్న అతిపెద్ద విద్యుత్ పవర్ ప్లాంట్‌పై రష్యా డ్రోన్లతో దాడి చేసింది. దీంతోపాటు వరుసగా అనేక దాడులు కొనసాగాయి. ఉన్న విద్యుత్ ప్లాంటు దగ్ధమైపోయినట్లు అందులో పనిచేసే ప్రత్యక్షసాక్షులు చెప్పారని వార్తలు వెల్లడించాయి. రష్యాలో ఆయిల్ రిఫైనరీలపై దాడులకు ప్రతిగా రష్యా ఈ ప్రతీకార దాడులు చేసింది. ట్రైపిల్స్కా విద్యుత్ ప్లాంట్‌పై దాడితో టర్బైన్లు, జనరేటర్లు దగ్ధమైపోయాయి. సంబంధిత సిబ్బంది పక్కనే ఒక షెడ్డులో తలదాచుకుని ఈ దృశ్యాలు చూశారు. ప్లాంటు మొత్తం పొగలు వ్యాపించి మంటల్లో దగ్ధమైపోయిందని రు చప్పారు. కీవ్, ఛెర్‌కాసీ, ఝిటోమైర్ ప్రాంతాలకు ఈ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. మొత్తం 30 లక్షలమంది వినియోగదారులకు ఈ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని ఉక్రేన్ అధికారులు చెప్పారు. దీనిపై శుక్రవారంనాడు మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ స్పదిస్తూ రష్యాలో చమురు రిఫైనరీలను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ దాడులు చేసిందనీ, అందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేశామని చెప్పారు. ఈ ప్లాంటుతోపాటు మరో పదిసార్లు కూడా గురువారం నుండీ ఉక్రేన్‌లో రష్యా దాడులు కొనసాగించింది.దీంతోపాటు ఉక్రేన్‌లోని రెండవ అతిపెద్ద నగరం ఖార్ఖివ్‌లో కూడా దాడులు జరిగాయి. ఖార్ఖివ్‌లో రాత్రికి రాత్రే ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు జరగాయి. ఈ ప్రాంతంలో ఉన్న రెండు లక్షమంది ప్రజలు విద్యుత్ లేక తీవవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడాదిలో జరిగిన అతి శక్తిమంతమైన దాడి ఇదేనని ఉకేరన్‌లో అతిపెద్ద ప్రైవేటు విద్యుత్ సంస్థ డిటిఇకె సంస్థ పేర్కొంది. ఉక్రేన్ ఇంధన సదుపాయాలపై రష్యా ఇటీవలే దాడులు పునరుద్ధరించింది. ఇప్పటికి 778 రోజులుగా ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం జరుగుతోంది.

# కరువుపై బిజెపి, బిఆర్‌ఎస్‌లది బాధ్యతారాహిత్యం : కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని కరువు అంశంపై కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, బిఆర్‌ఎస్ బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. కెసిఆర్, కిషన్ రెడ్డి బరితెగించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కరువు అంశంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 28 రాష్ట్రాల కంటే కూడా నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం , కరువు కాలంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ సహాయం చేసిందని గుర్తు చేశారు. తాగు, సాగు నీరు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పరిస్థితులపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారని, కష్టకాలంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు.




## ఫాంహౌస్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై లాటి చార్జీ చేసిన, పోలీస్ కేసులు నమోదు చేసిన తాము కెసిఆర్‌ను కలిసేంత వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని, సమస్యను కెసిఆర్ దృష్టికి తీసుకుపోతామని వారు బీస్మించుకోని నిరసనకు దిగారు. తమకు కెసిఆర్‌ను కలిపిస్తే తమ డబుల్ బెడ్‌రూంల ఇండ్లు కేటాయించిన విధానంపై వివరిస్తామని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కెసిఆర్ ప్రత్యేక కార్యదర్శి అక్కడకు చేరుకోని నిరసన చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడిన అనంతరం వారి నుంచి వినతి పత్రం తీసుకున్నారు. అలాగే కొంత మంది లబ్ధిదారుల పోన్ నెంబర్లు తీసుకొన్నారు. కెసిఆర్‌తో మాట్లాడి ప్రత్యేకంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

## రాష్ట్రపతి పాలన!

(మొదటి పేజీ తరువాయి)

మెజారిటీని నిరూపించుకున్నాం' అని ఆమె చెప్పారు. అదే విధంగా అతిషి క్యాబినెట్ సహచరుడు సౌరభ్ భరద్వాజ్ అదే తరహాలో మాట్లాడారు. 'ఢిల్లీలో రాజ్యాంగ సంక్షోభం గురించి బిజెపి, లెఫ్టినెంట్ గవర్నర్ మాట్లాడుతున్నారు. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కుట్ర జరుగుతోందని దీన్నిబట్టి తెలుస్తోంది. 2015, 2020లో ఢిల్లీలో బిజెపి రెండుసార్లు ఓడిపోయింది, ప్రభుత్వం ఏర్పాటు చేయలేమని దానికి తెలుసు. ఢిలీలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా అరవింద్ కేజ్రీవాల్ గెలుస్తారు' అని ఆయన అన్నారు. '2014లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించారు. ఆ సమయంలో మేం సుప్రీంకోర్టును ఆశ్రయించాం. ఆ తర్వాత ఎన్నికలు జరిగి 2015లో ఆప్ అధికారంలోకి వచ్చింది.రాష్ట్రపతి పాలన విధించినందుకు ప్రజలు తమకు సమాధానం ఇచ్చారని, ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధిస్తే, ఢిల్లీ ప్రజలు మళ్లీ వారికి సమాధానం చెబుతారు' అని భరద్వాజ్ పేర్కొన్నారు.

## ముగ్గురు యువకులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగాగాయపడ్డ చందును జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

# పది రోజులు దాటినా ఒక్క గింజా కొనలే

(మొదటి పేజీ తరువాయి)

కష్టనష్టాలకోర్చి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతన్నకు భంగపాటే ఎదురవుతోంది. తేమశాతం, తప్ప, తాలు పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అన్నీ ఉన్నా లారీలు అందుబాటులో లేవని తూకం వేయడంలో తీవ్ర జాప్యం చేస్తుండడం పట్ల జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఒక్కో కొనుగోలు కేంద్రంలో నాలుగు లారీలకు సరిపడా ధాన్యం ఉంటోంది. దీన్ని బట్టి చూస్తే కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు స్పష్టమవుతున్నాయి.

### జాప్యమెందుకు?

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు నత్తకే నడక నేర్పేలా సాగుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ యేడాది 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే లక్ష్యంగా జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా 341 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అందులో ఐకెపి 50, పిఎసిఎస్ 238, డిసిఎంఎస్ 47, హాకా 6 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కేంద్రాలు ప్రారంభించి నప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదంటూ ఆందోళనలు సైతం ప్రారంభమయ్యాయి. ధాన్యం క్వింటాలు గ్రేడ్ ఏ ధర రూ.2203, కామన్ రూ.2183 మద్దతు ధర ఉంది. అయితే తప్ప, తాలు, తేమ పేరిట ఇబ్బందులకు గురిచేస్తుండగా సందులో సడేమియాలాగా దళారులుగా మారిన కొందరు రైస్‌మిల్లర్లు తక్కువ ధర చెల్లించి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. మద్దతు ధరకు రూ.800 నుంచి రూ. 500 తక్కువ చేసి కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ధాన్యంలో అధిక తేమశాతం అనే సమస్య తలెత్తడం లేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం ఆరబెట్టిన ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉండాల్సిన 17 శాతం తేమకంటే తక్కువనే అవుతుందని , అయినప్పటికీ సెంటర్ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చోద్యం చూస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోళ్లలో ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న జాప్యం అధికారుల పర్యవేక్షణ లోపమా? సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యమా? అనే అంశాలను పక్కనపెడితే చేతికి వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయితే బాధ్యత ఎవరిదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో చిరుజల్లులు కవ్విస్తూ అకాల వర్షాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఉన్నతస్థాయిలో అధికారులు రోజువారీగా పర్యవేక్షిస్తున్నప్పటికీ జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, సివిల్ సప్లైస్ డిఎం, పౌరసరఫరాల శాఖ అధికారి స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్ 1వ తేదీన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చొప్పదండి మండలం వెదురుగట్టలో కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా ప్రారంభించినప్పటికీ అధికారులు మాత్రం ఈ నెల 12 నుంచే కొనుగోళ్లు మొదలయ్యాయని చెబుతుండడం విశేషం.

### చివరి గింజవరకు కొనుగోలు చేస్తాం రజనీకాంత్, డిఎం, సివిల్‌సప్లైస్

జిల్లావ్యాప్తంగా 341 కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభమయ్యాయి. గతేడాది మార్చి 24కే ప్రారంభమయ్యాయి. ఈ సారి ఏప్రిల్ 12న కొనుగోళ్లు మొదలయ్యాయి. చిగురుమామిడి మండలం బొమ్మెనపల్లి, వీణవంకతో కలిపి 29 టన్నులు కొనుగోళ్లు జరిగాయి. మే చివరి వరకు కొనుగోళ్లు జరుగుతాయి. ప్రతి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

## ఉపేక్షించేదిలేదు

(మొదటి పేజీ తరువాయి)

నెలలు మరింత కీలకమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవడంలేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అప్పటికంటే భూగర్భ జల మట్టం పడిపోవడంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

### తాగునీటి సరఫరాను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఎక్కడైనా ఫిర్యాదు వచ్చినా వెంటనే అక్కడ తాగునీటి సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. ఏ రోజుకారోజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారధ్యంలో మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు తాగునీటి ఇబ్బందులున్న చోటికి స్వయంగా వెళ్లి పరిశీలించాలని, అక్కడ సమస్యను పరిష్కరించే చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా, మరింత డిమాండ్ పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సిఎం అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్‌కు తెచ్చుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు వెంటనే చేయాలని ఆదేశించారు. మరోవైపు సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సిఎం సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒక చోట తాగునీటి సరఫరా నిలిచి పోయిందని ఈ సందర్భంగా సిఎం దృష్టికి వచ్చింది. ఉద్దేశ పూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. అకారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అటువంటి ఉద్యోగులపై ఉదాసీనంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సిఎం హెచ్చరించారు.

## సిబిఐ కస్టడీకి కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఆమె నివాసం నుండి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆమెను మొదట అరెస్టు చేశారు. వారి విచారణప్రక్రియ పూర్తయిన తర్వాత సిబిఐ రంగంలోకి దిగింది. ఇటీవలనే సిబిఐ అధికారులు ప్రత్యేక కోర్టు అనుమతి పొందిన అనంతరం తీహార్ జైలుకు వెళ్ళి కవితను ప్రశ్నించారు. కోర్టులో నిందితురాలు కవిత తరపు న్యాయవాది నితేశ్ రాణా వాదించారు. అరెస్టు చేసేందుకు సిబిఐ చేసిన విజ్ఞప్తిని ఆయన తిరస్కరించారు. ఆమె అరెస్టు అక్రమమనీ, చట్టవిరుద్ధమనీ వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిబిఐకి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేశారు. కవితను ఐదు రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని సిబిఐ కోరింది. ఆమె తమ ప్రశ్నలను దాటవేసే ధోరణిలో సమాధానాలిస్తూ, విచారణకు సహకరించడంలేదని సిబిఐ అధికారులు కోర్టుకు తెలియజేశారు. ఐనప్పటికీ కోర్టు తిరస్కరించి మూడు రోజులే అనుమతి ఇచ్చింది. "ఆమ్ ఆద్మీపార్టీకి ముడుపులు సమర్పించిన వ్యవహారంలో ఆమె నిర్వహించిన పాత్ర గురించి మేం ప్రశ్నించినప్పుడు ఆమె సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేదు. ఆమె దాటవేత ధోరణి అనుసరిస్తున్నారు,ఆమె సమాధానాలు పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి, దర్యాప్తు సందర్భంగా మేం స్వాధీనం చేసుకున్న పత్రాలలో ఉన్న సమాచారానికి భిన్నంగా ఆమె అసత్యాలు వల్లెవేస్తున్నారు, ప్రత్యేకించి కొన్ని వాస్తవాలకు ఆమె మాత్రమే సమాధానాలు చెప్పవలసి ఉంది, కానీ చెప్పడం లేదు, ఇంతకు ముందు మేం సమన్లు జారీ చేసినాగానీ ఆమె హాజరు కాకుండా తప్పించుకున్నారు, అందువల్ల ఐదు రోజుల పాటు ఆమె మా కస్టడీలో ఉండాల్సిదే, ఆ గడువు కావాల్సిందే" అని ప్రత్యేక కోర్టులో సిబిఐ వాదించింది. ఐతే సిబిఐ వాదనలను కవిత తరపు న్యాయవాది రాణా తిరస్కరించారు. కవితకు ఉన్న ప్రాథమిక హక్కులను సిబిఐ ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. సౌత్ గ్రూప్‌నకు చెందిన మద్యం వ్యాపారి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారని సిబిఐ కోర్టుకు తెలియజేసింది. తన వ్యాపారాభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ఆయనను కోరారని పేర్కొంది అందుకు కేజ్రీవాల్ ఆయనకు పూర్తి భరోసా ఇచ్చారని, వాట్సాప్ చాట్‌ల ద్వారా ఈ సమాచారం అందుబాటులో ఉందని సిబిఐ కోర్టుకు తెలియజేసింది. ఆప్ కమ్యూనికేషన్ల విభాగం మాజీ ఇన్‌చార్జి, ఈ కేసులో సహ నిందితుడు విజయ్ నాయర్‌కు రూ.100 కోట్లు చెల్లించిన విషయాన్ని అప్రూవర్‌గా మారిన దినేశ్ అరోరా ధృవీకరించారని సిబిఐ కోర్టుకు తెలియజేసింది. విజయ్ నాయర్‌కు ముడుపులు ఇచ్చిన విషయాన్ని నిందితుడు అభిషేక్ బోయినపల్లి తనకు చెప్పారని దినేశ్ అరోరా తమకు తెలియజేశారన్నది సిబిఐ వాదన.

## డైలమాలో గులాబీ శ్రేణులు

(మొదటి పేజీ తరువాయి)

గులాబీ వర్గాలను అయోమయానికి గురిచేస్తున్నాయి. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, ఇప్పటికిప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండా వేచి చూసే ధోరణిలో వారు ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఎంపి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను పార్టీ శ్రేణులు తమ భుజ స్కందాలపై వేసుకునేందుకు కూడా సిద్ధంగా కనిపించడం లేదని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ఎంతో ఉత్సాహంగా వచ్చిన పార్టీ శ్రేణుల్లో ఇప్పుడు ఆ ఉత్సాహం కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు తమ ఉనికిని కాపాడుకునేందుకు బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కెటిఆర్ ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహించి, పార్టీ శ్రేణులను లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ సమావేశాలలో పాల్గొనడానికి పార్టీ శ్రేణులు కూడా ఆసక్తిగా ముందుకు రావడం లేదని, స్థానిక నాయకత్వం బలవంతంతో సమావేశాలకు హాజరువుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని, వివిధ పదవులను అనుభవించి అధికారం కోల్పోయిన తర్వాత వారు ఇతర పార్టీలో చేరుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో తాము గుర్తుకొచ్చామా అని పార్టీ శ్రేణులే బాహాటంగానే కొందరు నాయకులను ప్రశ్నిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎంపి అభ్యర్థులకు స్థానిక గులాబీ శ్రేణుల నుండి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు. మరి కొన్ని నియోజకవర్గాల్లో ఎంపి అభ్యర్థులకు, స్థానిక నాయకత్వం మధ్య సమన్వయంలోపం కనిపిస్తోంది.

లిక్కర్ కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్ లాంటి పలు కేసులు పార్టీశ్రేణులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఫోన్ ట్యాపింగ్‌లో ఏ నాయకుడి పేరు వస్తుందో?, ఎవరిపై కేసులు నమోదవుతాయోనని పార్టీ శ్రేణుల్లో టెన్షన్ నెలకొన్నది. పైగా లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు కనీసం ఎన్ని స్థానాలు వస్తాయనేది కూడా ముఖ్యనేతలు చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. దీనికితోడు ప్రస్తుతం ఉన్న ఎంఎల్‌ఎలలో కొందరు పార్టీని వీడుతున్నట్టు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. మరి కొందరు నేతలు కూడా ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ ఎంపి అభ్యర్థుల తరపున విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒక వేళ పార్టీ సమావేశాలకు, ఎన్నికల ప్రచారానికి వెళ్లినా మొక్కుబడిగానే పాల్గొంటున్నట్టు బిఆర్‌ఎస్ వర్గాలే చెబుతున్నాయి. అందుకే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో గులాబీ శ్రేణుల్లో ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్ వేచిచూసే ధోరణిలో ఉన్నట్టు తెలుస్తోంది.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## ఎన్నికల నిధి కోసం విజ్ఞప్తి

**ప్రియమైన కామ్రేడ్స్, మిత్రులారా..**

దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ఇప్పటికే ప్రకటించబడడంతో పాటు, నామినేషన్‌ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక, విభజనవాద, మతతత్వ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సిపిఐ, వామపక్షాలు సర్వశక్తులతో ప్రయత్నాలు చేస్తున్నాయి. కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రిత బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులన్నిటినీ ఏకం చేసేందుకు కృషి సాగుతున్నది. ప్రజాస్వామ్య భారతదేశ భవిష్యత్తు కోసం ఈసారి పెద్ద యుద్ధం జరుగుతున్నది.

అధికార పార్టీకి కార్పొరేట్ సంస్థలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఎలక్టోరల్ బాండ్స్‌లో దాతల జాబితాను ప్రచురించిన తరువాత ఈ వాస్తవం స్పష్టమైంది. ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా మన పార్టీ డబ్బును స్వీకరించలేదు. లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలో వామపక్షాలు కీలక పాత్ర పోషించాల్సి ఉన్నది. అలాగే ఎన్నికల ప్రక్రియ, విరాళాల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం నిలబడాలి. ఇది కమ్యూనిస్టుల భుజాలపై ఉన్న చారిత్రక బాధ్యత. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యులు, మద్దతుదారులు, మిత్రులు సిపిఐ ఎన్నికల నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని సిపిఐ జాతీయ సమితి విజ్ఞప్తి చేస్తున్నది.

పార్టీ కామ్రేడ్‌లు అందరూ విస్తృతంగా నిధులను సేకరించి, వాటిని రాష్ట్ర కేంద్రం లేదా పార్టీ కేంద్ర ప్రధాన కార్యాలయానికి పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం జరిగేవి అత్యంత కీలకమైన ఎన్నికలు. వామపక్షాలు, అందులో ప్రత్యేకించి సిపిఐ బలం పార్లమెంటులో పెరగాలి. తద్వారరానున్న ప్రభుత్వంలో ప్రజల జీవనోపాధికి సంబంధించిన తక్షణ అంశాలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. ఇందు కోసం ప్రచారం చేసేందుకు మనకు అత్యవసరంగా నిధులు అవసరం. ప్రతి పార్టీ సభ్యుడు, అభిమాని తమ స్థోమతకు అనుగుణంగా పార్టీ నిధికి విరాళాలు ఇవ్వాలి. కింది చిరునామా, బ్యాంకు ఖాతాకు తక్షణమే చెక్‌లు/డ్రాఫ్ట్స్/ ఇఎంఒ/యుపిఐ ద్వారావిరాళాలు పంపించాలి.

**విరాళాలు పంపేందుకు వివరాలు :**

**చిరునామా :** Communist Party of India, Central Office, Ajoy Bhavan, 15, Indrajit Gupta Marg, New Delhi – 110002.

*ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సిన ఖాతా వివరాలు.*

*బ్యాంకు పేరు:* Canara Bank, Branch: CBSE, Rouse Avenue, New Delhi, account number: 24171010000036, IFSC No. CNRB0012417. UPI ID: 220958321000036@cnrb.



విప్లవ అభినందనలతో..

**డి.రాజా**
ప్రధాన కార్యదర్శి

## ఆంధ్రప్రదేశ్‌లో 'ఇండియా' సర్దుబాటు

ఆంధ్రప్రదేశ్‌లో బిజెపిని అంటకాగిన ప్రతిపక్ష ఎన్‌డిఎ కూటమి, పాలక వైసిపిలను ఓడించే లక్ష్యంతో 'ఇండియా' కూటమి భాగస్వాములయిన కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) మధ్య సీట్ల సర్దుబాటు ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం సిపిఐ, సిపిఐ(ఎం)లు పోటీచేస్తున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలిలా ఉన్నాయి.



**సిపిఐ :**
**లోక్‌సభ** – గుంటూరు – జంగాల అజయ్ కుమార్

**అసెంబ్లీ ..అభ్యర్థులు :**
1. విశాఖ పశ్చిమ – అత్తిలి విమల
2. ఏలూరు – బండి వెంకటేశ్వరరావు
3. విజయవాడ పశ్చిమ – జి.కోటేశ్వరరావు
4. అనంతపురం అర్బన్ – సి. జాఫర్
5. పత్తికొండ – పి.రామచంద్రయ్య
6. తిరుపతి – పి.మురళి
7. రాజంపేట – భూక్య విశ్వనాథ నాయక్
8. కమలాపురం – గాలి చంద్ర

**సిపిఐ (ఎం)**
**లోక్‌సభ** – అరకు

**అసెంబ్లీ సీట్లు :**
1.రంపచోడవరం
2.కురుపాం
3.గాజువాక
4.విజయవాడ(సెంట్రల్)
5.గన్నవరం
6.మంగళగిరి
7.నెల్లూరు టౌన్
8.పాణ్యం

## మూడవ విడత ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మూడవ విడతలో 12 రాష్ట్రాల్లోని 94 నియోజకవర్గాలకు మే 7వ తేదీన ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం విడుదలైంది. అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 19వ తేదీన నామినేషన్ల దాఖలకు చివరి గడువు. అయితే మధ్యప్రదేశ్‌లోని బెటల్ నియోజకవర్గంలో ఎన్నికలు వాయిదా పడడగా, ఆ స్థానానికి ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. బిఎస్‌పి అభ్యర్థి మృతితో బెటల్ స్థానంలో ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. కాగా, మూడవ విడతలో పోలింగ్ జరగనున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, దాద్రనగర్ హవేలీ, డామ్ అండ్ డియూ, గోవా, గుజరాత్, జమ్ముకశ్మీర్, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. 18వ లోక్‌సభ ఎన్నికల మొత్తం ఏడ విడతల్లో జరగనున్నాయి. ఈనెల 19వ తేదీన తొలి దశ పోలింగ్ జరగనుంది. ఫలితాలు జూన్ 4వ తేదీన వెలవడనున్నాయి.



రాజ్యాంగం పట్ల బిజెపికి అపారమైన గౌరవం ఉంది. బాబా సాహెబ్ అంబేద్కర్ స్వయంగా కూడా దానిని రద్దు చేయలేరు. బిజెపి రాజ్యాంగాన్ని మార్చేస్తున్నదంటూ కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నది. నిజానికి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల పట్ల ఆ పార్టీ దశాబ్దాలుగా వివక్ష చూపుతున్నది. అంబేద్కర్ ఓటమికి కారణమైంది. ఆయనకు 'భారత రత్న' కూడా ఇవ్వలేదు. ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇప్పుడు రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకొని నన్ను విమర్శిస్తున్నది. దేశ ప్రతిష్టను, సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. హిందువుల పట్ల 'ఇండియా' కూటమి పూర్తి వ్యతిరేకతను కనబరచడం ప్రమాదకరం.

**జైపూర్ (రాజస్థాన్) ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోడీ**



నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను తప్పనిసరిగా అధిగమిస్తాం. ఉద్యోగావకాశాలు పెంచుతాం. 'పాంచ్ న్యాయ్'తో అన్ని వర్గాలకు మేలు చేకూర్చడంతోపాటు, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటాం. కులగణనను బిజెపి వ్యతిరేకిస్తున్నది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల అభ్యున్నతి పట్ల ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతున్నది. గత పదేళ్ల కాలంలో మోడీ సర్కారు రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. కార్పొరేట్ శక్తులకు అనుకూల, ప్రజలకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంది. దేశం అన్ని రంగాల్లోనూ తిరోగమనంలో వెళుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి చేసిన పొరపాట్లను సరిదిద్ది, దేశాభివృద్ధికి కృషి చేస్తాం.

**తిరునల్‌వెల్లి (తమిళనాడు) ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ**

# ఎన్నికల సమరానికి సై

### లోక్‌సభ ఎలక్షన్ గోదాలో పెరుగుతున్న అభ్యర్థులు

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పట్టుగొమ్మలు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, గణతంత్ర రాజ్యంగా అవతరించిన తర్వాత 1952లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. చివరిగా 2019లో లోక్‌సభ ఎన్నికలు ముగియగా, మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 1952లో 1,874కాగా, 2019లో అది 8,039కి, అంటే నాలుగు రెట్లు పెరిగింది. అదే సమయంలో ఒక్కో నియోజకవర్గానికి సగటు అభ్యర్థుల సంఖ్య 4.67 నుంచి 14.8కి పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మరోసారి రాజకీయ రణరంగం సిద్ధమైంది, అయితే, 1952లో మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుండి పోటీ చేసే అభ్యర్థుల నిష్పత్తి పెరిగినప్పటికీ, ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉన్నారో ఇంకా తేలలేదు. 1977లో ఆరవ లోక్‌సభ ఎన్నికల వరకు ఒక లోక్‌సభ స్థానానికి సగటున కేవలం మూడు నుండి ఐదుగురు మాత్రమే పోటీ చేసేవారు. కానీ, గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా సగటున 14.8 మంది అభ్యర్థులు పోటీకి దిగారు. లాభాపేక్ష లేని సంస్థ పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ విశ్లేషణ ప్రకారం, 2019 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో 542 పార్లమెంటరీ నియోజకవర్గ స్థానాలకు 8,039 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. గత లోక్‌సభ ఎన్నికలను నిశితంగా పరిశీలిస్తే, మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణలోనే సగటు అత్యధికం. ఇందులో ప్రధానంగా నిజామాబాద్ నుంచి 185 మంది పోటీ పడ్డారు. నిజామాబాద్ మినహా రాష్ట్ర సగటు పోటీదారుల సంఖ్య 16.1. తెలంగాణ తర్వాత తమిళనాడులో గత ఎన్నికల్లో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థుల సగటు అత్యధికంగా ఉంది. అక్కడ ఒక్కో నియోజకవర్గంలోని అభ్యర్థుల్లో సగటున మూడింట రెండు వంతుల మంది స్వతంత్ర అభ్యర్థులే.

నిజామాబాద్ తర్వాత కర్ణాటకలోని బెల్గాంలో అత్యధిక అభ్యర్థులు పోటీ పడడం కనిపించింది. ఎక్కువ మంది అభ్యర్థుల ప్రాతినిధ్యం ఉన్న ఐదు నియోజకవర్గాలు దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందినవే కావడం విశేషం. భారతీయ జనతా పార్టీ (బిజెపి) 435, కాంగ్రెస్ 420 స్థానాల్లో పోటీ చేశాయి. ఈ రెండు పార్టీలు 373 స్థానాల్లో పరస్పరం ఢీకొన్నాయి. కాగా, ఎక్కువ మంది అభ్యర్థులను నిలబెట్టిన పార్టీల జాబితాలో బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి)ది మూడో స్థానం. ఏడు జాతీయ పార్టీలు కలిసి ఒక్కో నియోజకవర్గానికి 2.69 మంది అభ్యర్థులను నిలబెట్టాయి. అతిపెద్ద ఐదు రాష్ట్రాలలో ఒకటైన పశ్చిమ బెంగాల్‌లో నుంచి ఎక్కువ మంది, అంటే 4.6 శాతం మంది అభ్యర్థులు జాతీయ పార్టీలకు



చెందిన వారు. కాగా, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలు కలిపి ఒక్కో నియోజకవర్గానికి సగటున 1.53 మంది అభ్యర్థులను నిలబెట్టాయి. ప్రాంతీయ పార్టీలకు చెందిన అభ్యర్థులను లోక్‌సభకు ఎన్నుకున్న రాష్ట్రాల్లో బీహార్ (6 రాష్ట్ర పార్టీలు), తమిళనాడు (8 రాష్ట్ర పార్టీలు) మొదటి రెండు స్థానాల్లో నిలుస్తాయి. లోక్‌సభలో ఈ పార్టీల అభ్యర్థుల సగటు వరుసగా 1.2, 1.3 శాతం. కాగా, 30 కంటే ఎక్కువ పార్లమెంటరీ నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాలు ఐదు. అవి వరుసగా, ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42), బీహార్ (40), తమిళనాడు (39). ఈ రాష్ట్రాలన్నిటినీ కలిపితే, మొత్తం సీట్ల సంఖ్య 249. లోక్‌సభ సీట్లలో ఈ రాష్ట్రాల వాటా 46 శాతం. ఏదిఏమైనా, ప్రతిసారీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతున్నది. 1952లో 489 స్థానాలకు 1,874 మంది అభ్యర్థులు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి సగటున 3.83 మంది అభ్యర్థులు ఉన్నారు. 1971లో ఆ సంఖ్య క్రమంగా పెరిగి 2,784 మందికి చేరింది. అంటే, నియోజకవర్గానికి సగటున 5.37 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 1977లో, 2,439 మంది అభ్యర్థులు పోటీ చేయగా, ఒక్కో నియోజకవర్గానికి సగటు అభ్యర్థులు 4.5గా ఉంది. 1980 ఎన్నికలలో అభ్యర్థుల సంఖ్య 4,629కి పెరిగింది, సగటు 8.54. ఇక, 1984–85లో, ఎనిమిదవ సాధారణ ఎన్నికలలో 5,492 మంది పోటీపడ్డారు, సగటున ఒక్కో నియోజకవర్గం నుంచి 10.13 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 1989లో జరిగిన తొమ్మిదవ సాధారణ ఎన్నికల్లో సగటున 11.34 మంది అభ్యర్థులతో 6,160 మంది అభ్యర్థులు రంగంలోకి దిగారు. 1991–92లో జరిగిన 10వ లోక్‌సభ ఎన్నికల్లో 8,668 మంది అభ్యర్థులు 543 స్థానాలకు పోటీ చేశారు. అంటే సగటున ఒక్కో నియోజకవర్గానికి 15.96 మంది చొప్పున పోటీకి దిగారు. 1996లో జరిగిన 11వ సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో, ఒక్కో సీటుకు 25.69 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఈ సగటు అకస్మాత్తుగా పెరగడం గమనార్హం. అప్పుడు 543 లోక్‌సభ స్థానాలకు రికార్డు స్థాయిలో 13,952 మంది అభ్యర్థులు పోటీపడ్డారు.

1991లో అత్యధికంగా ఉన్న 16.38 శాతంగా ఉన్న పోటీదారుల సగటు 25.69కి చేరుకుంది. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సెక్యూరిటీ డిపాజిట్ (ధరావతు) మొత్తాన్ని రూ. 500 నుండి రూ. 10,000కి పెంచింది. ఈ నిర్ణయం వల్ల, చాలా కాలం తర్వాత 1998 లోక్‌సభ ఎన్నికలలో ఒక సీటుకు పోటీదారుల సంఖ్యను 8.75 మంది అభ్యర్థులకు తగ్గింది. ఆ ఎన్నికల్లో 4,750 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. 1999 సాధారణ ఎన్నికలలో అభ్యర్థుల సంఖ్య స్వల్పంగా పెరిగి 4,648కి చేరుకుంది, సగటున ఒక్కో సీటుకు 8.56 మంది పోటీపడ్డారు.

2004లో, మొత్తం పోటీదారుల సంఖ్య మళ్లీ 5000 మార్కును దాటింది, అదే సంఖ్యలో 543 లోక్‌సభ స్థానాలకు పోటీలో 5,435 మంది పోటీదారులు ఉన్నారు. సగటున ఒక్కో సీటుకు కేవలం 10 మంది పోటీలో ఉండడం గమనార్హం. 2009 సార్వత్రిక ఎన్నికల్లో, 543 లోక్‌సభ స్థానాలకు మొత్తం 8,070 మంది అభ్యర్థులు పోటీ చేయగా, సగటున 14.86కు పెరిగిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 8,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 2019లో ఈ సంఖ్య 8,039. ఇక ఈసారి ఎన్నికల్లో ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల గోదాలోకి దూకుతారో చూడాలి.

### ఎలక్షన్స్ తీరుతెన్నులు..

- 1952లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికలకు దాదాపు రూ.104.5 మిలియన్లు ఖర్చు కాగా, 2014 సాధారణ ఎన్నికలకు దాదాపు రూ.38.7 బిలియన్లు (రూ.3,870. 3 కోట్లు) ఖర్చయ్యాయి.
- మొదటి లోక్‌సభ ఎన్నికల్లో 489 స్థానాలకు పోటీ జరిగింది. 1977లో నియోజకవర్గాల సంఖ్య 543కి పెరిగింది.
- 1952 ఎన్నికల్లో 489 స్థానాలకు మొత్తం 53 పార్టీలు, 533 మంది స్వతంత్రులు పోటీ చేశారు. 2014లో 543 స్థానాలకు 464 రాజకీయ పార్టీలు, 3,234 మంది అభ్యర్థులు పోటీ చేశారు.
- 2014 ఎన్నికల కంటే 2019 లోక్‌సభ ఎన్నికలకు మొత్తం ఓటర్ల సంఖ్య 84.3 మిలియన్లు పెరిగింది.
- కొత్త ఓటర్లు మొత్తం ఓటర్ల సంఖ్యను 900 మిలియన్లకు తీసుకువెళ్లారు, అందులో దాదాపు 15 మిలియన్లు 1819 ఏళ్ల మధ్య వయస్కులే.
- 2014లో దాదాపు తొమ్మిది లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈసారి మొత్తం 10 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.
- నేర చరిత్ర కలిగిన అభ్యర్థులు ప్రచార వ్యవధిలో మూడు సందర్భాల్లో వార్తాపత్రికలు, టివి ఛానెల్ల ద్వారా దీనికి సంబంధించిన సమాచారాన్ని ప్రచురించాలి.
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఇవిఎం), పోస్టల్ బ్యాలెట్ పేపర్లు మొదటిసారిగా అభ్యర్థులందరి ఫోటోను అందుబాటులోకి తెచ్చారు. ఇది ఓటర్లు పోటీలో ఉన్న రాజకీయ నాయకులను గుర్తించడంలో సహాయ పడతాయి.
- లోక్‌సభ ఎన్నికల ఖర్చు భారత ప్రభుత్వం భరిస్తుంది. ఎన్నికల పరిశీలకుల గౌరవ వేతనాలను మాత్రమే ఎన్నికల సంఘం చెల్లిస్తుంది.
- అసెంబ్లీ ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు, ఖర్చును కేంద్రం మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం (50:50) ప్రాతిపదికన పంచుకుంటాయి.
- 2014 లోక్‌సభ ఎన్నికల్లో, ఎనిమిది నియోజకవర్గాల్లో ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ (వివిప్యాట్‌లు) ఉపయోగించబడ్డాయి. ఈసారి అన్ని నియోజకవర్గాల్లో వివిప్యాట్లను వినియోగించనున్నారు.

# రాష్ట్రంలో వామపక్ష శక్తులు బలపడాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాజ్యాంగం రక్షింపబడాలన్నా, ప్రజాస్వామ్యం పరిరక్షించాబడాలన్నా కేంద్రంలో బీజేపీని సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొమురయ్య భవన్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ జిల్లా సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఎం, జిల్లా కార్యదర్శి బంధు సాయిలు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే దేశం, ఒకే చట్టం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. నేడు దేశంలో అవినీతి పరులంతా బిజెపిలోనే ఉన్నారని, విపక్షాల నాయకులను ఇడి, సిబిఐ, ఐటి లను ప్రయోగించి లొంగదీసుకుని బిజెపి లోకి చేర్చుకుని క్లీన్ చీట్ ఇస్తున్నారని అన్నారు. వీటి నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే రామాలయం, సీఏఏ, హిందూత్వం పేరుతో ప్రజలను మభ్యపెటుతున్నారని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని, దళిత వ్యతిరేక పార్టీ అయిన బిజెపికి ఎంఆర్‌పిఎస్ మద్దతు ఇవ్వడం సరికాదని అన్నారు. బిజెపి కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే ఉన్న రిజర్వేషన్ లను ఎత్తివేయడం ఖాయమని, అలాంటి పెత్తందారుల పార్టికి ఎంఆర్‌పిఎస్ మద్దతు తగదని అన్నారు.



బిజెపి ఉమ్మడి వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని, అందులో భూపాలపల్లికి ఎలాంటి లాభం చేకూరలేదని అన్నారు. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జె.వెంకటేష్ మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించలేకనే మతోన్మాద ఎజెండా ఎత్తుకున్నదని అన్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, సామాన్యుల ఆదాయం తగ్గి ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయం పెరగడానికి మోదీ విధానాలే కారణమని, మోడీని ఎన్నికలలో ఓడిస్తేనే పేదలకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ సదస్సులోఎమ్ సిపిఐయు నాయకుడు ఉపేందర్ రెడ్డి, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ ఆవు నూరి మధు, సిపిఎం ఎల్ లిబరేషన్ మారపల్లి మల్లేష్, సిపిఎం నాయకులు సమ్మిరెడ్డి,పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, సతీష్, సిపిఎం కంపేటి రాజయ్య, సిహెచ్ రమేష్, పి రాజేందర్, జి.దేవేందర్, ఏ.శ్రీకాంత్, వి.రాజయ్య, న్యూడెమోక్రసీ, సీపీఎం ఎంఎల్, లిబరేషన్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లోకసభ స్థానంలో కాంగ్రెస్‌దే గెలుపు

### వరంగల్ లోక్‌సభ ఇన్‌ఛార్జి రేవూరి ప్రకాష్ రెడ్డి ధీమా

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్‌లో లోకసభ స్థానంలో గెలుపు కాంగ్రెస్‌దేనని, మే 13న జరగనున్న ఎన్నికలలో వరంగల్ నుండి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య రెండు లక్షలకు పైగా మెజారిటీతో గెలిచి తీరుతుందని వరంగల్ లోకసభ కాంగ్రెస్ ఇంచార్జీ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఎంపి అభ్యర్థితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవూరి మాట్లాడుతూ బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కేంద్రంలో, రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి తాము చేసిన అభివృద్ధి పనులు చెప్పుకునే పరిస్థితి లేక కాంగ్రెస్ అభ్యర్థిపై ప్రజలలో అనుమానాలు, అపోహలు కలిగించే విధంగా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కడియం శ్రీహరి కూతురు కావ్య ముస్లింను వివాహం చేసుకున్నదని, ఆమె దళితులు కారని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మరోవైపు బిఆర్‌ఎస్ మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పులపాలు చేయడమే కాక కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల కుంభకోణం, లిక్కర్, ఫోన్ ట్యాపింగ్ లాంటి వ్యవహారాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి



రైతుల పేరుతో నాటకం ఆడుతున్నారని విమర్శించారు. పదేళ్ల బిఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలో 8వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఏ నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కడియం కుటుంబంపై విమర్శలు సరికాదని, ఆరూరి రమేష్ నగరం చుట్టూ భూ కబ్జాలకు పాల్పడ్డారని, ఆయనలాగా కడియం కుటుంబానికి భూ కబ్జాల చరిత్ర లేదని అన్నారు. వర్ధన్నపేట ఎంఎల్‌ఏ కెఆర్ నాగరాజు మాట్లాడుతూ మొన్నటి వరకు వర్ధన్నపేట ఎంఎల్‌ఏ గా ఆ నియోజకవర్గంలో భూ కబ్జాలకు పాల్పడిన ఆరూరి రమేష్ నేడు వరంగల్ లోక్‌సభ పరిధిలో భూకబ్జాలకు పాల్పడేందుకు ఎంపిగా పోటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంపి అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ తాను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ఇక్కడే చదువుకుని డాక్టర్‌గా ఉద్యోగం చేశానని, ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు వాళ్ల పార్టీ గురించి చెప్పుకునేది ఏదీ లేకనే తన కులం,మతం గురించి మాట్లాడుతున్నారని అన్నారు.

**కేంద్రం చేసిందేమీలేకనే మాపై వ్యక్తిగత విమర్శలు:**
**మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్‌ఏ కడియం ఫైర్**

కేంద్రం జిల్లా ప్రజలకు చేసిందేమీలేకనే తమపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఉకడియం శ్రీహరి అన్నారు. తన కూతురు ముస్లింను ప్రేమ వివా హం చేసుకున్నా చట్టం ప్రకారం తన కులమే వర్తిస్తుందని, మాత్రం అవగాహన లేకుండా బిజెపి నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. అలాగే కొందరు తాము బిఆర్‌ఎస్‌లో డబ్బులు తీసుకున్నాక పార్టీ మారి కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఒకవేళ తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే పోటీ నుండి తప్పుకుంటానని చెప్పారు. ఇక ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణ ఒక మాదిగ జాతి వ్యక్తి అయి ఉండి దళితులు, మైనారిటీలపై,పేదలపై దాడులు చేసే బీజేపి ఓటు వేయమని నిస్సిగ్గుగా ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతీసారీ ఎన్నికలపుడు ఏదో ఒక పార్టీకి అమ్ముడు పోవడం మందక్రిష్ణకు అలవాటేనని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, డిసిసిబి చైర్మన్ మార్నేని రవిందర్‌రావువరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు నమిండ్ల శ్రీనివాస్, కత్తి వెంకటస్వామి,బంక సరళ,సంపత్, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్ నేపథ్యంలో
## రంజాన్ తోఫాకు బ్రేకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''రంజాన్ తోఫా'' ను లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జూన్ మాసంలో బక్రీద్ సందర్భంగా ప్రభుత్వం పంపి ణీ చేయనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రంజాన్ తోఫాకు బ్రేకులు పడ్డాయి. రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు అందజేసే 'రంజాన్ తోఫా' పంపిణీ చేసేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఇందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. దీంతో రంజాన్ మాసం లో పంపిణీ చేయాల్సిన తోఫాను బక్రీద్ పండగ సందర్భంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రజాపక్షం

శనివారం, ఏప్రిల్ 13

## ఎన్నికల్లో ఏది ప్రధాన సమస్య?

ఏప్రిల్ – మే మాసాల్లో జరిగే 18వ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను వేధిస్తున్న ప్రధాన సమస్య ఏమిటో ఆలోచించాల్సిన అంశం. ఏ ఎన్నికలు అయినా అంతకుముందు ఐదేళ్లు పరిపాలన చేసిన ప్రభుత్వం పనితీరు మీద ఓటర్ల తీర్పు అనేది సర్వసాధారణ భావన. అయితే తమ పాలనపట్ల ప్రజల్లోని వ్యతిరేక భావనను దాటవేసేందుకు పాలక పార్టీ/పార్టీలు తెలివిగా కులం, మతం, ప్రాంతంతో ముడిపడిన భావోద్వేగ సమస్యలను విరివిగా ప్రచారంలో పెడతాయి. మనది కులరహిత, మతాతీత, లౌకిక ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్నప్పటికీ రాజకీయాల్లో సిద్ధాంత భావజాల వైరుధ్యాలు చప్పబడి అభ్యర్థుల ఎంపిక మొదలు ఓటర్ల సమీకరణ వరకు కులం, మతమే ప్రాతిపదికగా పనిచేస్తున్నది. మద్యం, డబ్బు వాటికి ఆలంబనగా పనిచేస్తున్నాయి; కొన్ని సందర్భాల్లో అవే నిర్ణాయకమవుతున్నాయి. ఇటీవల కాలంలో సంక్షేమం పేరుతో 'ఉచిత ప్రదానాలతో' ఓటర్లకు గాలం వేయటం, ప్రలోభపెట్టటం మితిమీరింది. వాటిని 'రేవడీ' (మిఠాయిలు)లని అవహేళన చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆయన పార్టీ సైతం అటువంటి వాగ్దానాలు కుమ్మరిస్తున్నాయి. ప్రజలెదుర్కొంటున్న నిత్యజీవిత సమస్యలనుండి వారి దృష్టి మళ్లించి పబ్బం గడుపుకోవటమే ఈ ఎత్తుగడ.

''ది హిందూ సిఎస్‌డిఎస్–లోక్‌నీతి'' ప్రీపోల్ సర్వే ప్రకారం ఓటర్లలో దాదాపు సగం మందిని వేధిస్తున్న ప్రధాన సమస్యలు నిరుద్యోగం, ధరల పెరుగుదల. పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో తమ సర్వేకి సమాధానాలిచ్చిన భిన్న శ్రేణుల్లో 62శాతం ఉద్యోగాలు దొరకటం చాలా కష్టంగా ఉందన్నారు. వారిలో అత్యధికులు (65శాతం) నగరవాసులు కాగా గ్రామీణులు 62 శాతం, పట్టణవాసులు 59శాతం. పురుషుల్లో 65శాతం, స్త్రీలలో 59 శాతం ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సునాయాసంగా ఉద్యోగాలు దొరుకుతున్నాయని 12శాతం మంది మాత్రమే వెలిబుచ్చారు. ముస్లింలు అత్యధికుల్లో (67 శాతం) ఈ ఆందోళన ఉంది. కాగా హిందువుల్లోని ఇతర వెనుకబడిన తరగతులు, షెడ్యూలు కులాల్లో (63శాతం), షెడ్యూల్డు తెగల్లో (59శాతం) ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు దొరకటం సులభతరమైందనే అభిప్రాయం వెలుబుచ్చిన వారు హిందూ అగ్ర వర్ణాల్లో 17శాతం ఉండగా, 57 శాతం దాంతో ఏకీభవించలేదు. ఉపాధి అవకాశాలు కుదించుకుపోవటానికి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని 21శాతం, రాష్ట్ర ప్రభుత్వానిదని 17శాతం, రెండింటిదీనని 57శాతం భావించారు. ధరల పెరుగుదల విషయంలోనూ దాదాపు ఇదే అభిప్రాయం ఈ సర్వేలో వెల్లడైంది. ధరలు పెరిగి భారంగా తయారైనాయని 71శాతం అభిప్రాయపడ్డారు. పేదల్లో 76శాతం, ముస్లింల్లో 76శాతం, షెడ్యూల్డు కులాల్లో 75 శాతం అదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

గత ఐదేళ్లలో జీవితాలు ఎంతోకొంత మెరుగైనాయని సుమారు 48శాతం అభిప్రాయం వ్యక్తం చేయగా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉందని 14శాతంమంది, దిగజారాయని 35శాతం చెప్పారు. అవినీతి పెరిగిందని 55శాతంమంది అభిప్రాయపడగా (2019లోక్‌నీతి పోల్‌లో 40శాతం), తగ్గిందని 19శాతం మాత్రమే (2019లో 37శాతం) చెప్పారు.

ఈ జీవిత సత్యాలనుబట్టి ఓటర్లు ఎవరికి ఓటు చేయాలో నిర్ణయించుకోగలిగితే ప్రభుత్వం మార్పు సంభవం. కాని ఎన్‌డిఎ కూటమి అన్నిచోట్ల మోడీని చూసి ఓటేయమంటోంది. ఆయనేమో అయోధ్యలో రామాలయం నిర్మించాం కాబట్టి రాముడికి ఓటేయమంటున్నారు. గతంలో చేసిన వాగ్దానాలు ఏవి నెరవేర్చారో, ఏవి 'ఎన్నికల జుమ్లా'లుగా దాటవేశారో చెప్పరు. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 3వ స్థానంలోకి తెస్తానంటారు – దాని ఫలితాలు అనుభవించేది ఆశ్రిత పెట్టుబడిదారులే కదా? 400సీట్లు గెలుపు ఎన్‌డిఎ లక్ష్యమంటున్న ఆయన బిజెపి పోటీచేసే 400 పైచిలుకు సీట్లలో ఒక ముస్లింను నిలబెట్టరు – కాని దేశ సమైక్యతను కాపాడేది తానేనంటారు. అంతా మాటల గారడీ! మోసపోతే మునిగిపోవటమే!!

# తాండవిస్తున్న నిరుద్యోగిత; దశాబ్దం కోల్పోయిన యువత

గ్యాన్ పాథక్

భారతదేశ యువత ఒక దశాబ్దం కోల్పోయింది. ''ప్రతి ఒక్కరికీ గౌరవంతో కూడిన పని'' కల్పిస్తామని 2014 ఎన్నికల ప్రచారకాలంలో నరేంద్ర మోడీ చేసిన వాగ్దానాన్ని వారు విశ్వసించా రు. ఇప్పుడు దశాబ్దం గడిచిన తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో ప్రధాని నరేంద్రమోడీ దగాతో మోసపోయామని వారు భావిస్తున్నారు. ఐఎల్‌ఒ, మానవాభివృద్ధి ఇన్‌స్టిట్యూట్ (ఐహెచ్‌డి) సంయుక్తంగా ఇటీవల ప్రచురించిన 'ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్టు 2024'' దీన్ని బట్టబయలు చేసింది. భారతదేశంలో ఇప్పుడు నిరుద్యోగుల్లో యువత 83 శాతం; వృద్ధికి ఉపాధుల వృద్ధి ప్రాతిపదికగా లేదు.

'ప్రతి చేతికీ గౌరవప్రదమైన పని'' కల్పించటమంటే ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పించాలి. ఎందుకంటే, ప్రతి ఏటా 70లక్షలమంది యువకులు వ్యవసాయరంగం వదిలిపెడుతున్నారు. ప్రతి ఏటా 160లక్షలమంది యువత వయోజనతలో చేరుతున్నది. కాగా భారత జనాభాలో మూడింట రెండువంతులు 35 సంవత్సరాలలోపు వయస్కులు. ఇండియా ఎంప్లాయిమెంట్ నివేదిక ఇలా స్పష్టం చేస్తున్నది : మిలియన్‌ల కొలది యువతకు ఎప్పటికీ ఉద్యోగం దొరకదు; వారిలో అనేకమంది ఉద్యోగార్హత వయోపరిమితి మీరిపోయారు. ఒక వేళ ఏదోవిధంగా ఉద్యోగం దొరికిన వారిలో కూడా 90శాతం అనియత ఉపాధిపరులు. శ్రామికశక్తిలో 82శాతం అనియత రంగంలో ఉన్నారు. 2022లో 55.8 శాతం మందికి స్వయం ఉపాధి ఉపాధికి ప్రధాన వనరుగా ఉంది. క్యాజువల్ ఉపాధి 22.7శాతం, రెగ్యులర్ ఉపాధి 21.5శాతం.

ఇండియా ఎంప్లాయిమెంట్ నివేదిక, 2024, లేబర్, ఉపాధి సమస్యపై ఐహెచ్‌డి (న్యూఢిల్లీ) వరుస ప్రచురణల్లో మూడవది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఒ) సహకారంతో రూపొందించిన ఈ నివేదిక యువత ఉపాధి, విద్య, నైపుణ్యాలపై ప్రత్యేకించి దృష్టిపెట్టింది. 2000–2022 మధ్య నేషనల్ శాంపిల్ సర్వేలు (ఎన్ఎస్ఎస్), పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు (పిఎల్‌ఎఫ్ఎస్) లోని ప్రభుత్వ గణాంక సమాచారంపై ఆధారపడి, 2023కు అంచనాలతో అది రూపొందించబడింది. పరిశ్రమల వార్షిక సర్వే, నేషనల్ అక్కౌంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా – కెఎల్ఇఎంఎస్ డేటాబేస్ ఈ నివేదికకు ఇతర మూలాలు. కచ్చితంగా ఈ కారణంవల్లనే ప్రభుత్వం ఈ నిర్ధారణలను నిరాకరించలేకపోయింది; భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు విఎ నాగేశ్వరన్ ప్రభుత్వం వాస్తవికంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని చెప్పారు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వ వైఖరి అందులో వ్యక్తీకరణ పొందింది.



ఏదోవిధంగా ఉద్యోగం దొరికిన వారిలో కూడా 90శాతం అనియత ఉపాధిపరులు. శ్రామికశక్తిలో 82శాతం అనియత రంగంలో ఉన్నారు. 2022లో 55.8శాతం మందికి స్వయం ఉపాధి ఉపాధికి ప్రధాన వనరుగా ఉంది. క్యాజువల్ ఉపాధి 22.7శాతం, రెగ్యులర్ ఉపాధి 21.5శాతం.

అనేక కారణాలరీత్యా ఆ ప్రకటన మహాదారుణమైంది. అంతకు వారం రోజుల క్రితం మార్చి 20న ప్రధానమంత్రి న్యూఢిల్లీలో 'స్టార్టప్ మహా కుంభ్'లో ప్రసంగిస్తూ, భారతదేశ యువత ''ఉద్యోగార్థులకన్నా మిన్నగా ఉపాధి సృష్టికర్తలు కావటాన్ని ఎంచుకుంటున్నారని'' అన్నారు. ప్రధానమంత్రి మోడీ బహుశా నిరాశాజనకంగా ఉన్న నిరుద్యోగిత దృశ్యాన్ని తక్కువచేసి చూపుతున్నారు. అది గడచిన 10 సంవత్సరాలుగా ఆయన పాలన కింద సృష్టించబడుతున్న అగాధం. ఆయన విధానాలు సంపద సృష్టి, లాభాలపై తప్ప ఉపాధిపై దృష్టిపెట్టలేదు. 20పెద్దకంపెనీలు దేశ సంపదలో 60శాతం కలిగి ఉన్నాయి, మొత్తం జాతీయాదాయంలో 70శాతం ఆర్జిస్తున్నాయి.

భారతదేశంలో లేబర్, ఉపాధి సమస్యలపై త్రైపాక్షిక సంస్థ అయిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 2013 మే నెలలో జరిగిన 45వ సమావేశంలో సిఫారసు చేసిన ''జాతీయ ఉపాధి విధానాన్ని'' మోడీ ప్రభుత్వ తీసుకురాలేదు. అప్పుడు నిరుద్యోగిత రేటు సుమారు 4.1శాతం. ఐఎల్‌సి 46వ సమావేశం 2015లో జరిగింది. మోడీ ప్రభుత్వం అటు తర్వాత ఆ సమావేశాన్ని పిలవలేదు. ఐఎల్‌సిని, భాగస్వాములైన భారత ట్రేడ్ యూనియన్‌లను సంప్రదించకుండానే ప్రభుత్వం వివాదాస్పదమైన నాలుగు లేబర్ సంహితలను తీసుకువచ్చింది.

ఉపాధి కల్పనపై ప్రధాని మోడీ బుకాయిస్తున్నప్పటికీ, నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో కెల్లా మిక్కిలిగా 6.1శాతానికి చేరింది. నిరుద్యోగం 3.1 శాతానికి తగ్గిందని కొద్దివారాల క్రితమే మోడీ ప్రభుత్వం చెప్పుకున్నది. కాగా ఇండియా ఎంప్లాయిమెంట్ నివేదిక ఉపాధి కల్పన రంగంలో ముఖ్యంగా యువతలో ఉన్న విచారకర పరిస్థితిని వెలుగులోకి తెచ్చింది. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించజాలదని సిఇఎ నాగేశ్వరన్ చెప్పటంలో ప్రభుత్వ నిస్సహాయత ప్రతిబింబించింది. అది బిజెపి అధికారిక వైఖరి అయితే అది దిగ్భ్రాంతికరం అన్నారు మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరం. ''కుర్చీదిగండి'' అని ఈ ప్రభుత్వానికి ధైర్యంగా చెప్పవచ్చునన్నారు. ***ఆచార్య వినోబాభావే మాటలను ఉట్టంకించటం సందర్భోచితంగా వుంటుంది; భావే అందరికీ ఉపాధిని ప్రచారం చేస్తుండగా, అది ఎలా సాధ్యమని ఆర్‌కె పాటిల్ ప్రశ్నించారు! దానికి వినోబా జవాబు – మీరు గుర్రం కళ్లెం పట్టుకుని ఉన్నారు, ఆశ్వికుడిని తోసేశారు, అది మీ తప్పు. మీరు అందరికీ ఉపాధి ఇవ్వలేకపోతే మీరు రాజీనామా చేయాలి.***

అయితే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి మూడవ పదవీకాలం కోరుతున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఇలా అన్నారు: ''నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య యువత భవిష్యత్‌ను నాశనం చేస్తుండగా, మోడీ ప్రభుత్వ విచారకరమైన నిర్లక్ష్యం దెబ్బను మన యువత భరిస్తున్నది. భారతదేశంలో నిరుద్యోగ సమస్య దారుణంగా ఉందని ఐఎల్‌ఒ, ఐహెచ్ డి నివేదిక స్పష్టంగా చెబుతున్నది. వారు చాలా మితంగా చెప్పారు. నిరుద్యోగిత అనే టైం–బాంబ్ మీద మనం కూర్చుని ఉన్నాం''. యువత నిరుద్యోగిత 2012తో పోల్చితే మోడీ ప్రభుత్వం కింద మూడు రెట్లు పెరిగిందన్నారు.

యువత నిరుద్యోగం నిజంగా పెద్ద సవా లు. ఎందుకంటే, 2021లో వారు దేశజనాభాలో 27 శాతం. యువజన నిరుద్యోగిత దాదాపు మూడు రెట్లు పెరిగింది. అది 2000లో 5.7శాతం, 2019లో 17.5శాతం. కాగా 2022లో 12.1శాతానికి తగ్గింది. విద్యాస్థాయితోపాటు యువజన నిరుద్యోగిత పెరుగుతోంది. పురుషుల్లోకన్నా స్త్రీలలో ఎక్కువగా ఉంది.

## నిరుద్యోగం పలు రకాలు..

నిరుద్యోగం అంటే ఎలాంటి ఉపాధి లేకుండా ఉండడం. అయితే, నిరుద్యోగంలో ఎన్నో రకాలు ఉన్నాయి. ఒక ఉద్యోగం నుంచి మరో ఉద్యోగానికి మారే సందర్భంలో వచ్చిన కొద్దిపాటి విరామాన్ని సంఘృష్ట నిరుద్యోగిత అంటారు. ఆర్థిక మాంద్యం వంటి సంక్షోభ పరిస్తితుల్లో ఎంతో మంది ఉద్యోగాలు కోల్పోవడంతో చక్రియ నిరుద్యోగిత పెరుగుతుంది.

నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పుడు, సాంకేతికతంగా విప్లవాత్మక మార్పులు జరిగినప్పుడు నిర్మితి నిరుద్యోగిత ఏర్పడుతుంది. తమ ప్రమేయం లేకుండానే, తాత్కాలికంగా ఉపాధి లేకపోవడాన్ని అస్వచ్ఛంద నిరుద్యోగంగా పేర్కొంటారు. విద్యార్హతలకు, చేస్తున్న ఉద్యోగానికి సంబంధం లేకపోవడాన్ని అల్ప నిరుద్యోగిత అంటారు. చేయడానికి ఎలాంటి పనీ లేకపోడాన్ని బహిరంగ నిరుద్యోగితగా పరిగణిస్తారు. అత్యంత సంపన్నులు లేదా బద్ధకస్తులు ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడరు. అటువంటి సమయాల్లో స్వచ్ఛంద నిరుద్యోగిత ఏర్పడుతుంది. కొన్ని రుతువుల్లో మాత్రమే ఉద్యో గం ఉంటే, రుతుపవన నిరుద్యోగిత వస్తుంది. ఇక అన్నిటి కంటే ముఖ్యమైనది, మన దేశం ఎక్కువగా ఎదుర్కొంటున్నది 'ప్రచ్ఛన్న నిరుద్యోగిత'. ఇది ఒక ప్రత్యేకమైన పరిస్థితి. పని చేస్తున్నప్పటికీ, సదరు పని వల్ల అదనపు ప్రయోజనం లేకపోవడమేన ప్రచ్ఛన్న నిరుద్యోగితకు నిదర్శనం. ఉదాహరణకు ఒక ఎకరా భూమిలో భార్యాభర్తలు పని చేస్తున్నప్పుడు వచ్చిన ఫలసాయమే, వారి పిల్లలు అదే పొలంలో తల్లిదండ్రులతో కలిసి పని చేస్తున్నప్పుడు కూడా మారకపోతే, అదనంగా పని చేస్తున్న ఇద్దరూ ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పాలి. మన దేశంలో వ్యవసాయ రంగంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మోడీ సర్కార్

అత్యధిక గ్రామీణ ప్రజానీకానికి చేరువైన సంక్షేమ కార్యక్రమం ఏదైనా ఉన్నదంటే అది 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం'. గ్రామీణ భారతంలో కోట్లాదిమందికి ఉపాధి కల్పన ద్వారా నిరుద్యోగ సమస్యను రూపుమాపడం, గ్రామీణ వలసలను అంతమొందించటం, సామాజిక ఆస్తుల ను సృష్టించడం, గ్రామీణ గిరాకీని పెంచి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొం దించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకం అమల్లోకి వచ్చి సుమారు 18సంవత్సరాలు దాటింది. ఈ మధ్యకాలంలో ఈ పథకం కింద నిర్ణీత కాలంలో గ్రామీణులకు ఉపాధి లభిం చి, కొంతమేరకు వారి బతుకుల్లో ఆశాదీపాలు వెలిగిన మాట నిజం. ఈ పథకానికి మోడీ ప్రభుత్వం గత నాలుగైదు సంవత్సరాలుగా కేటాయింపులను తగ్గిస్తూ వస్తుంది. 2020–2021 బడ్జెట్‌లో రూ.1,11, 169కోట్లు కేటాయిస్తే, 2023–24 బడ్జెట్‌లో కేవలం రూ.60,000 కేటాయించారు. గ్రామీణ నిరుద్యోగిత 7శాతం కొనసాగుతున్న నేపథ్యంలో నిధులు, పనిదినాలు మరింత పెంచవలసిన అవసరం ఉన్నది. 100 రోజుల పనివిధానాన్ని కనీసం 150 రోజులకు పెంచాలని,




రోజు కూలీని కనీసం రూ.500లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**'ఉపాధి' పై తీవ్ర నిర్లక్ష్యం:**

ఉపాధి హామీ చట్టాన్ని మోడీ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని, బిజెపి పాలనలో ఈ పథకానికి నిధులు సరిపోను ఇవ్వటంలేదని గణంకాలు సూచిస్తున్నాయి. దీంతో కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్నాయని యూనియన్ నాయకులు, సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యావేత్తలు, కార్యకర్తల కన్సార్టియం అయిన లిబిటక్ ఇండియా అందించిన డేటా ప్రకారం.. గత 21 నెలలు సిస్టం నుంచి 7.6కోట్ల జాబ్ కార్డులు తొలగించబడ్డాయి. 2013–14లో గ్రామీణ ఉపాధి చట్టం మొత్తం బడ్జెట్‌లో 1.98 శాతం వాటాను కలిగి ఉన్నది. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది 2023–24 మొత్తం బడ్జెట్‌లో 1.33 శాతానికి తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్స రం (203–24) సవరించి అంచనాలతో పోల్చితే కేటాయింపుల్లో పెరుగుదల మాత్రం శూన్యం కావటం గమనార్హం.

**వేసవిలో చెల్లించే అదనపు వేతన నిలుపుదల:**

ఉపాధి హామీ కూలీలకు వేసవిలో చెల్లించే అదనపు భత్యం పూర్తి గా నిలిపివేశారా? వేసవిలో కూలీలకు ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన ఈ విధానానికి మంగళం పాడారా? అంటే అవుననే సమాధానా లు వస్తున్నాయి. ఈ అదనపు భత్యం చెల్లింపులు రాష్ట్రంలో గత మూడేళ్లు గా నిలిచిపోయాయి. ఈ ఏడాది అయినా పార్లమెంటు ఎన్నికలు వస్తున్న వేళ అదనపు వేతనం అమలు చేస్తారనుకుంటే దానికి సంబంధించి ఇప్పటిదాకా ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్న ఉపాధి కూలీలు అదనపు భత్యాన్ని చెల్లించి తమకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత ఫిబ్రవరి నుంచి మే నెల వరకు రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతుంటాయి. అయితే, ఈ సమయంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో ఉపాధి పనులకు వచ్చే కూలీలకు సాధారణంగా చెల్లించే వేతనానికి మరికొంత మొత్తాన్ని అదనంగా చేర్చి చెల్లింపులు చేసేవారు. ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చి నెలలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్ నెలలో 20శాతం అదనపు భత్యంగా చెల్లించేవారు. దీంతో ఫిబ్రవరి నుంచి జూన్ నెల వరకు పనిచేసే కూలీలు అదనపు ఆదాయం పొందే వారు. అదనంగా భత్యం వస్తుండటంతో ఈ సీజన్‌లో పనికి వచ్చే కూలీల సంఖ్య కూడా అదనంగా ఉండేది. పనులు వేగంగా జరిగేవి. కాని, కూలీలకు వేసవిలో చెల్లించే అదనపు భత్యం మూడేళ్లుగా అమలు కావడం లేదు. ఇప్పటికైనా అదనపు కూలి చెల్లించుటకు ఆదేశాలు వస్తాయని ఎదురుచూస్తున్నప్పటికీ, ఇప్పటిదాకా ఎలాంటి మార్గదర్శకాలు లేవు. ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుంచి కార్యకలాపాలు కొనసాగించిన సాఫ్ట్‌వేర్‌కు బదులుగా కొత్తగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ కు మార్చారు. వేసవి భత్యం చెల్లింపునకు సంబంధించిన ఆప్షన్ ఈ కొత్త సాఫ్ట్‌వేర్‌లో లేదు. దీంతో ఈసారి కూడా ఉపాధి కూలీలకు వేసవి భత్యం చెల్లింపు లేనట్టేనని తెలుస్తుంది.

**రూ.65కోట్ల దాకా నష్టపోతున్న కూలీలు:**

వేసవి అదనపు భత్యం చెల్లింపులు నిలిపివేయడంతో రాష్ట్రవ్యాప్తం గా ఉపాధి కూలీలు ఈ ఒక్క సీజన్‌లోనే రూ.65కోట్ల వరకు నష్టపోతున్నారు. ఎంజిఎంఆర్ఈజిఎస్ పథకం కింద ప్రతి కూలీకి ఏడాదికి 100 రోజులు పని కల్పించాలి. ఉదాహరణకు వికారాబాద్ జిల్లాను తీసుకుంటే జిల్లాలో 566 గ్రామపంచాయతీల్లో 1,82,794 జాబ్ కార్డులు ఉండగా, వాటిల్లో 3,75,638 మంది కూలీలు నమోదయ్యారు. జిల్లా లో 1.35 లక్షల వరకు యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా 2.54 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధిహామీ పథకం కూలీలకు 62,83,158 రోజుల పని కల్పించాలని లక్ష్యం ఉండగా జిల్లాలో ఇప్పటివరకు 5,029 కుటుంబాలకు 100రోజుల పని దినాలు కల్పించారు. జిల్లాలో కూలీలు సరాసరి వేతనంగా రూ.186.96 పొందుతుండగా ఈ ఏడాది ఇప్పటిదాకా రూ.106.82 కోట్ల విలువైన పని రోజులు పూర్తి చేశారు. అయితే అదనపు భత్యం నిలిపివేయడంతో ఈ సీజన్‌లో ఒక వికారాబాద్ జిల్లాలోని ఉపాధి కూలీలు సుమారు రూ.2 కోట్ల వరకు వేతనం నష్టపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇది రూ.55నుంచి రూ.65 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**'ఉపాధి' వేతనం పెంపు!**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలి రేట్లను రోజు కూలి కింద కనీసం రూ.500లు గా నిర్ణయించి అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఎన్నికలు వస్తున్న వేళ ఉపాధి హామీ పథకం కూలిరేట్లను సవరించారు. దీంతో ఉపాధి హామీ పనులుచేసే కూలీలకు వివిధ రాష్ట్రాలలో 4 శాతం నుంచి 10శాతం వరకు కూలి రేట్లు పెరగనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి పొంది.. సవరించిన కూలి రేట్లను మార్చి నెల 27వ తేదీన నోటిఫై చేసింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం నైపుణ్యం లేని కార్మికులకు అత్యధికంగా హర్యానాలో రోజుకు రూ.374, అత్యల్పంగా అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలలో రూ.234 చెల్లించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూలీ రేటు రూ.28లు పెరిగి రూ.300కు చేరింది. నోటిఫికేషన్ వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గోవాలలో సుమారు 10శాతం వరకు కూలీ రేట్లను పెంచారు.

ఎంజిఎన్ఆర్ఈజిఎ ను బడా కార్పొరేట్ సంస్థలు సూత్రప్రాయం గా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో వారికి అనుగుణంగా నడుస్తున్న మోడీ ప్రభుత్వం ఈ స్కీంకు నిధులను తగ్గించుతూ వస్తున్నారని, తక్కువ ఆదాయం, భారీ నిరుద్యోగం ఉన్న పరిస్థితుల్లో, వ్యవసాయ కార్మికుల జీవితాలు వారి సంక్షేమం దృష్ట్యా ఎక్కువ నిధులు కేటాయించి వారికి సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646

# బిజెపి అభ్యర్థుల రొడ్డకొట్టుడు ప్రసంగాలు!

దేశంలోనే అతిపెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్‌ను భారతీయ జనతా పార్టీ బరిలోకి దింపింది. వామపక్ష భావాజాలంతో విద్యార్థి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన.. టిఆర్ఎస్ ద్వారా రాజకీయ ఆరంగేట్రం చేశారు.

కమలాపూర్, హుజూరాబాద్‌ల నుంచి ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. తదనంతర రాజకీయ పరిణామాలతో ఆయన బిజెపి పార్టీలో చేరారు. మొదట్లో వామపక్ష భావజాలం, రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న ఆయన.. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో చేస్తున్న ప్రచారంలో ఆయన చేస్తున్న ప్రసంగాలు చూసి రాజకీయ నాయకులే కాదు.. ఆయన సన్నిహితులు సైతం నోరెళ్లబెడుతున్నారు.

తెలంగాణపై పూర్తి పట్టు, రాజకీయ అంశాలపై సమగ్ర అవగాహ న, పార్టీల్లోని లోటుపాట్లు తెలిసిన ఆయన.. తన విజయభారాన్ని కేవలం మోడీ పైనే వేసినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. అతనే కాకుండా సికింద్రాబాద్ నుంచి బరిలో ఉన్న కిషన్ రెడ్డి, నిజామాబాద్ నుంచి బరిలో ఉన్న ధర్మపురి అర్వింద్, కరీంనగర్ నుంచి బరిలో ఉన్న బండి సంజయ్, మెదక్ నుంచి బరిలో ఉన్న రఘునందన్ రావు, మహబూబ్ నగర్ నుంచి బరిలో ఉన్న డికె అరుణ ప్రసంగాలను వింటే కూడా అలాగే కనిపిస్తున్నది. స్థానిక సమస్యలను అసలు ప్రస్తావించకుండా, అభివృద్ధి గురించి చర్చించకుండా.. 'జమ్మూ కాశ్మీర్, బాంబు పేలుళ్లు, మందిర్ మస్జిద్, హిందూముస్లిం' చుట్టే ప్రసంగాలు ఉంటుండడం గమనార్హం.

**మోడీ నామజపమే**

దక్షిణాదిలో ఏ నినాదంతో వెళ్లాలో బిజెపి అభ్యర్థులకు అర్థం కావడం లేదు. బిసి, ఎస్‌సి నినాదాలను ఎత్తుకున్నా వర్కవుట్ కాకపోవడంతో నేతలంతా రొడ్డకొట్టుడు విమర్శలు, మోడీ నామజపం పైనే ఆధారపడ్డారు. బాంబు పేలుళ్లు లేవని, మందిరం నిర్మించారని, ఉక్రేన్, రష్యా యుద్ధాన్ని ఆపారంటూ చెప్పిన మాటలే మళ్లీమళ్లీ చెబుతూ మనుషుల మెదళ్లలో చొప్పించడానికి ప్రయత్నిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల్లో అనుసరించిన స్ట్రాటజీని దక్షిణాది రాష్ట్రా ల్లో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

**విద్వేషపూరిత ప్రసంగాలే..**

దేశంలో ద్వేషపూరిత ప్రసంగాలు పెరుగుతున్నాయని ఇండియా హేట్ ల్యాబ్ ఇటీవల స్పష్టం చేసింది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో 75 శాతం ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు చోటు చేసుకున్నాయని వెల్లడించింది. బిజెపి నేతలతోపాటు విహెచ్‌పి, బజరంగ్ దళ్ వంటి సంఘాల నేతలు వీటిని ఎక్కువగా చేస్తున్నట్లు పేర్కొన్నది. 2023లో ముస్లింలను టార్గెట్ చేస్తూ 668 ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు నమోదు కాగా, ఇందులో 498 ప్రసంగాలు బిజెపి పాలిత, కేంద్ర పాలిత, ఢిల్లీలోనే జరిగినట్లు నిర్ధారించారు. వాటిలో 239 ప్రసంగాలు ముస్లింల పై ప్రత్యక్ష హింసాకాండను ప్రేరేపించేవిగా ఉన్నట్లు గుర్తించారు. 420 ప్రసంగాలు లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, హలాల్ జిహాద్, పాప్యులేషన్ జిహాద్ లకు సంబంధించినవిగా ఉన్నాయి. 169 ఘటనలు ముస్లిం ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకున్నవి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనే ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. అత్యంత విద్వేష ప్రసంగాలు చేసిన ఎనిమిది మంది నేతల్లో నేతల్లో తెలంగాణకు చెందిన బిజెపి ఎంఎల్ఎ రాజాసింగ్ కూడా ఉండడం గమనార్హం.

**ఆ ఆరుగురి స్పీచెస్ వింటే..**

బిజెపి కి చెందిన ఆరుగురు కీలక నేతలు ఈ సారి పార్లమెంట్ బరిలో ఉన్నారు. ప్రతి రోజు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, డికె అరుణకు వారి వారి నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. టిఫిన్ బైఠక్, చాయ్ పే చర్చ, మార్నింగ్ వాక్, అల్పాహార విందు.. వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి చొచ్చుకొని వెళ్తున్నారు. అయితే గత వారం రోజులుగా వారి ప్రసంగాలు వింటే.. సేమ్ టూ సేమ్ కనిపిస్తున్నాయి. 'అయోధ్యలో రామ మందిర నిర్మాణం, గతంలో బాంబు పేలుళ్లు.. ఇప్పుడు ప్రశాంత వాతావరణం, రష్యా – ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపించిన మోడీ, జమ్మూకాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, మేకిన్ ఇండియా, లవ్ జిహాద్,' ఇవే అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. దీంతో స్థానిక, రాష్ట్ర సమస్యల గురించి పట్టించుకోకుండా.. ఢిల్లీ హైకమాండ్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ నే వీరు చదువుతున్నట్టు అర్థమవుతున్నది.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# రైల్వేల తీరు మారేనా? సౌకర్యాలు పెరిగేనా?

లేఖ

రైలులో స్వల్పదూర ప్రయాణాలకు తప్పనిసరిగా సాధారణ టికెట్, దూరప్రాంత ప్రయాణాలకు సాధారణ లేదా ముందస్తు రిజర్వేషన్ ద్వారా టికెట్లను పొందాలి. టికెట్ కొనుగోలు నుండి గమ్యం చేరేవరకు సాధారణ ప్రయాణీకులు చాలా అవస్థలు పడుతున్నారు. సాధారణ టికెట్లను స్టేషన్ కౌంటర్లు దగ్గర, రిజర్వేషన్ టికెట్లను స్టేషన్ కౌంటరుతో సహా ఆన్‌లైన్‌లో వ్యక్తిగత ఐడిల ద్వారా తగిన రుసుము చెల్లించి బుక్ చేసుకోవచ్చు. ఇక్కడ నుండే ప్రయాణికుల పాట్లు మొదలవుతాయి. స్టేషన్ కౌంటర్ దగ్గర చేంతాడంత లైన్ ఉంటుంది. స్టేషన్‌లో సరిపోనన్ని కౌంటర్లు ఉండవు. మహిళల, వృద్ధుల పరిస్థితి చెప్పనలవి కాదు. ఒక్కోసారి టికెట్ తీసేలోపే ట్రైన్ వచ్చి వెళ్ళిపోతుంది. ఇలాంటి సందర్భంలో ఏమీ చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ప్రయాణికుడు ఉంటాడు. 'మీరు వెళ్ళవలసిన బండి ఒక గంట లేటుగా నడుస్తుంది. అసౌకర్యానికి చింతిస్తున్నాం' అనే స్వాగత పలుకులతో రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే లెక్కలేనన్ని సమస్యలు ఎదురవుతాయి.

రైలు నిలయంలో సౌకర్యాల లేమికి కొదువుండదు. దాహంవేస్తే ఉన్నోడు వాటర్ బాటిల్ కొనుక్కుంటాడు. లేనోడు కుళాయిని వెతుక్కుంటాడు. కానీ వాటిలో నీరు త్రాగడానికి పనికిరాదు. మరి చల్లని నీటి సౌకర్యం అందుబాటులో ఉంటుంది కదా అని కొంత మంది అనొచ్చు. అవి అందరికీ అందుబాటులో ఉంటాయా అనేదే అంతు చిక్కని ప్రశ్న. చిన్న చిన్న స్టేషన్లో అసలు ఇవి ఉండనే ఉండవు. ఆకలేస్తే తినడానికి ఏది కొందామన్నా స్పెషల్ ధర. పులిసిపోయిన, పాచెక్కిన ఆహార పొట్లాల నాణ్యతను చూసే వీలులేకుండా అందమైన ప్యాకెట్లలో విక్రయిస్తారు. ఇవి కొనుక్కొని తినాల్సిందే. తప్పదు... తినే పదార్థాలు తాజాగా లేకపోయినా ధరలు మాత్రం ఫ్రెష్‌గా ఉంటాయి. మూత్రానికి పోయి రావాలంటే 'పే అండ్ యూజ్' అనే బోర్డులు కనిపిస్తా యి. దీనర్థం తెలియని సాధారణ ప్రయాణీకునికి అక్కడికి వెళ్లేంత వరకూ తెలియదు. దీనికి కూడా 'రుసుము చెల్లించాలా ?' అని. ఉచిత మూత్రశాలల గురించి చెప్పనవసరం లేదు. అపరిశుభ్రంగా ఉంటాయి. అందుకే చాలా మంది బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తున్నారు.

**ఫిర్యాదు ఏలా చేయాలో తెలియదు:** ప్రతీ రైలులో సామాన్యులు ఎక్కువగా ప్రయాణించే ద్వితీయ శ్రేణి బోగీల సంఖ్య తక్కువగా, ఎ.సి బోగీల సంఖ్య ఎక్కువగా ఉంటున్నాయి. అందువలన సాధారణ ప్రయాణీకునికి ఇబ్బందులు తప్పడం లేదు. సెకం డ్ క్లాస్ బోగీలు పరిస్థితి చూస్తే, అక్కడైనా సౌకర్యంగా ఉంటుందా...? అంటే అదీ ఉండదు. కొంత మంది జనరల్ టికెట్ తీసుకొని రిజర్వ్‌డ్ బోగీలు ఎక్కేస్తున్నారు.మరి వీళ్ళని టి.సిలు చూడడం లేదా? ఇవన్నీ బహిరంగ రహస్యాలే..! మరి ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడం ఎందు కు?ఎ.సిటికెట్ ధర ఎక్కువే కానీ సౌకర్యాలు తక్కు వ.

**పరిష్కారాలు :** ముందుగా వేళకు ట్రైన్ వచ్చేటట్లు చూడాలి. టికెట్స్ కొనుగోలుకు సరిపడినన్ని ఆఫ్ లైన్ కౌంటర్స్ ఏర్పాటుచేయాలి. రద్దీ నియంత్రణ కొరకు రైల్వే పోలీసులను ఉంచాలి. జనరల్ బోగీల సంఖ్య పెంచాలి. పరిశుభ్రమైన ఉచిత మరుగు దొడ్లు అందుబాటులో ఉండాలి. స్టేషన్ ఆవరణలో, బోగీల్లో సౌకర్యాలు బాగుండాలి. ఆహార ధరలు, నాణ్యతపై నియంత్రణ ఉండాలి. సాధారణ టికెట్ తీసుకున్న వారికి ఉన్నత శ్రేణి కోచ్‌లలో ప్రవేశాన్ని నిషేధించాలి.

రిజర్వేషన్ చేసేటప్పుడు తక్కువ ధర వసూలు చేసి ప్రయాణ తేదీకి 10 రోజుల ముందు టికెట్ ధర మొత్తం చెల్లించే విధానాన్ని తీసుకురావాలి. తత్కాల్ టికెట్ల సంఖ్య పరిమితం చేయాలి. రిజర్వేషన్ టికెట్ రద్దు చార్జీలు తగ్గించాలి. ఐసిఎఫ్ బోగీల స్థానంలో యల్ హెచ్ బికోచ్‌లని ప్రవేశపెట్టాలి. అధికారులు దృష్టి పెట్టాలి.

డిజెఎం రావు

# వ్యవసాయ చట్టాల అమలును తిప్పికొట్టాలి



ప్రజాపక్షం / హుజూర్‌నగర్: దేశంలో వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తానని బహిరంగంగా క్షమాపణ చెప్పిన మోడీ వాటిని చాపకింద నీరులా అమలు చేసే విధానం తిప్పికొట్టాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు రైతాంగాన్ని కోరారు. అఖిల భారత కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం ముందు రైతు సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో అనేక రాష్ట్రాలో ప్రజా ప్రభల్యంతో గెలిచిన ప్రభుత్వాలను, ఫిరాయింపులను ప్రోత్సహించి బలత్కర మార్పులను చేసిన మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1936 ఏప్రిల్ 11న ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభకు ఎన్.జి రంగాస్వామి, సహజనంద సరస్వతీ దీర్ఘకాలికంగా నాయకత్వం వహించారని స్వాతంత్ర్యానికి పూర్వమే రైతాంగాన్ని ఐక్యం చేసి వారి సమస్యలతో పాటు ఈ దేశానికి స్వాతంత్ర్యం రావాలని పోరాటాలు నిర్వహించిన విషయం ఆయన గుర్తు చేశారు. రైతు సంఘం నాయకులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్య నారాయణలు మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ధరణిలో ఉన్న లోపాలను గుర్తించి రైతాంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వేసవిలో వేసిన పంటలు భూగర్భజలాలు లేక ఎండిపోవడంతో పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోయి అనేక ఎకరాలు పశువుల మేతకు వదలారని అన్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి పంట చేతికి రాకపోవడంతో రైతులు నైరుషంతో ఉన్నారని వారిని ప్రభుత్వం ఆదుకుని ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు యల్లావు రమేష్, రైతు సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల రమేష్, మామిడి నరసయ్య, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, సిపిఐ పట్టణ కార్యవర్గసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలకులను ఓడిద్దాం..



కోదాడ (చిలుకూరు): మండల కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు పుట్టపాక అంజయ్య రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొడ్డా వెంకటయ్య అధ్యక్షతన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో అవలంభించిన రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి పాలకులను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నల్లవ్యవసాయ చట్టాలను తీసుకవచ్చి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. నల్లవ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలతో మోడీ ప్రభుత్వం దిగివచ్చి నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసి మరలా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బాలెబోయిన రవి, పిల్లుట్ల కిష్టయ్య, యరగాని నాగయ్య, కొండా శేషయ్య, బొడ్డు కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సహకరించండి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

ప్రజాపక్షం/భువనగిరి రూరల్: తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ, రాష్ట్ర పార్టీలు నిర్ణయించలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు మాసాల నుండి ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదు పార్లమెంటు స్థానాలు సిపిఐ పార్టీ గుర్తించినదని ఇందులో ఒక పార్లమెంటు స్థానం సీటు సిపిఐకి కేటాయించాలని మా పార్టీ జాతీయ రాష్ట్ర కమిటీలు కాంగ్రెస్ అధినాయకత్వానికి ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు. ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతూనే ఇప్పటికీ కాంగ్రెస్ నుండి మా పార్టీకి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. మన రాష్ట్రంలో సిపిఐ పార్టీ ఎవరికి సహకరించాలో నిర్ణయించలేదు. మత రాజకీయాలు విచ్చలవిడిగా కొనసాగిస్తున్న బిజెపిని ఓడించాలని ఇండియా కూటమి నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని తెలియజేశారు.

## గురవయ్య సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం / కోదాడ (చిలుకూరు): సిపిఐ గ్రామ కార్యదర్శి కామ్రేడ్ గొర్రె గురవయ్య సేవలు చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఆర్లెగూడెంకు చెందిన సిపిఐ గ్రామ కార్యదర్శి గొర్రె గురవయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు గురవయ్య మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై సిపిఐ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కామ్రేడ్ గురవయ్య గ్రామంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఆయన సేవలను స్మరించుకున్నారు. రెండు పర్యాయాలు సిపిఐ గ్రామ కార్యదర్శిగా పనిచేసి పార్టీ అభివృద్ధికి గురవయ్య కృషి చేశారన్నారు. ఎన్నికల సమయంలో పలు పార్టీలు ప్రలోభాలకు గురిచేసిన పార్టీని వీడకుండా నిబద్ధతగా పనిచేసిన నిజమైన కార్యకర్త గురవయ్య అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అలీ, వీరబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సోషల్ సైన్స్ ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్‌కు బంగారు పతకాలు



ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు సిల్వర్ జోన్ అంతర్జాతీయ సోషల్ సైన్స్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ సంధర్బంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సోషల్ పట్ల కనీస అవగాహన ఉండాలని, నేటి తరంలో పోటీపరీక్షలలో సోషల్ ఆధారిత అంశాలకు ప్రత్యేకమైన స్థానం ఉన్నదన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన అంతర్జాతీయ సోషల్ సైన్స్ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందిన విధ్యార్థులు హోరవ్, కె.ఆరాధ్య(4వ), మహ్మద్ హన్నన్ (5వ), ఎన్.సింగిరెడ్డి(5వ), సి.హనీష్ (7వ) తదితర విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆధునిక నవయుగ వైతాళికుడు పూలే



ప్రజాపక్షం / మిర్యాలగూడ: ఆధునీక భారత నవయుగ వైతాళికుడు మహాత్మ జ్యోతి బాపూలే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. జ్యోతిరావుపూలే 197వ జయంతిని పురస్కరించుకోని గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శతాబ్దాల క్రితమే అసమానతలు లేని సమాజ స్థాపనకు నిర్విరామం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. నిమ్నవర్గాల సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, దామరచర్ల, వేములపల్లి మండల కార్యదర్శులు ఎండి.సయ్యద్, ధీరావత్ లింగా నాయక్, జిల్లా యాదగిరి, ఎఐటియుసి నాయకులు వల్లపట్ల వెంకన్న, జానయ్య, శ్రీనివాస్‌రావు, నా గయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య ఆశయ సాధనకు కృషి



ప్రజాపక్షం / సూర్యాపేట: స్వాతంత్ర సమరయోధుడు, గీత పనివారుల సంఘం రాష్ట్ర నాయకులు, దివంగత నేత కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య ఆశయ సాధనకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం (ధర్మభిక్షం భవన్)లో ఆయన ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడికి భూమి, గీసేవారికి చెట్టు అన్న నినాదంతో భూమి కోసం భుక్తి కోసం జరిగిన తెలంగాణ విముక్తి పోరాడంలో ముందుండి పోరాడారని గుర్తు చేశారు. పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, నాయకులు దంతాల రాం బాబు, బొమ్మగాని శ్రీనివాస్, దోరేపల్లి శంకర్, ఖమ్మంపాటి అంతయ్య, రాము, రేగట్టి లింగయ్య, నిమ్మల ప్రభాకర్, శ్రీకాంత్, ఎండి పాషా, తాళ్ళ సైదులు, హరి, శేఖర్, పద్మ, రేఖ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి రవి అన్నారు. శుక్రవారం ఇటీవల 65 నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల ఘటన స్థలాలను నేషనల్ హైవే అధికారులు, జిఎంఆర్ అధికారులతో కలిసి ప్రమాదం జరిగే స్థలాలను పరిశీలించారు. ఇటీవల 65నెంబర్ జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు చోటు చేసుకోవడంతో వాటి నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు మద్యం సేవించి వాహనాలు నడవద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడవద్దని సూచించారు. ఆయన వెంట సూర్యాపేట రూరల్ సిఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ లింగం, జాతీయ రహదారి, జిఎంఆర్ అధికారులు ఉన్నారు.

## సిఎం నిర్ణయం యువతకు గొప్పవరం

స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీగా రామానంద తీర్థ సంస్థ అప్‌గ్రేడ్

త్వరలో 30 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



ప్రజాపక్షం / యాదాద్రి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం యువతకు గొప్ప వరం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి శివారులోని జలాల్ పూర్ గ్రామంలో ఉన్న రామానంద తీర్థ గ్రామీణ సంస్థను చిన్నారెడ్డి సందర్శించారు. సంస్థ ప్రాంగణం అంతా కలియ తిరిగి శిక్షణా కార్యక్రమాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, విద్యార్థుల హాస్టల్ గదులను చిన్నారెడ్డి నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి ఆ సంస్థ డైరెక్టర్ లక్ష్మీ సహా సిబ్బందితో సమావేశమయ్యారు. స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీగా రామానంద తీర్థ సంస్థ అప్‌గ్రేడ్ చేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయం అని, యువతీ, యువకులకు గొప్పవరమని చిన్నారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో 30 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ పరంగా కల్పించనున్నట్లు చిన్నారెడ్డి తెలిపా రు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ కూడా యువతకు ఇవ్వనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. 10 ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ డెవలప్మెంట్ నోడల్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు నెలకొల్పనున్నట్లు చిన్నారెడ్డి వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత నిరుద్యోగ, యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలపై తనపై పెట్టుకున్న భరోసా నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉద్యోగ ఉపాధి కార్యాచరణ అమలులోకి వస్తుందని చిన్నారెడ్డి తెలిపారు. అర్బన్, రూరల్ వారీగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అనేక స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు అందుబాటులో వస్తాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయానికి అనుగుణంగా రామానందతీర్థ సంస్థలో సౌకర్యాలపై చిన్నారెడ్డి ఆరా తీశా రు. 100 ఎకరాల స్థలంతోపాటు మెరుగైన వసతులు ఉన్నట్లు చిన్నారెడ్డి గమనించారు. యూనివర్సిటీ స్థాయి కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన వెంట సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి, సంస్థ ప్రతినిధు ఉన్నారు.

## మూడు నెలల్లోనే రూ.150 కోట్ల అభివృద్ధి పనులు

తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



ప్రజాపక్షం / తుంగతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన మూడు నెలల కాలంలోలనే తుంగతుర్తి నియోజకవర్గంలో రూ. 150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన దశాబ్ద కాలంగా తుంగతుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో రోడ్డు వ్యవస్థ, విద్య, వైద్యం రంగాలు నిరాధరణకు గురయ్యాయని చెప్పారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో అభివృద్ధి కాంక్షతోనే ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మోత్కూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, 365 జాతీయ రహదారి నుండి తుంగతుర్తి మీదుగా రావులపల్లి వరకు 16 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అర్వపల్లి మండలం తిమ్మాపురం, కోడురూ, కోమ్మాల, సంఘెం, చిల్పకుంట్ల మీదుగా నూతనకల్ వరకు రూ. 33 కోట్లతో రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్లే అంతర్గత రోడ్లను కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక సౌకర్యాలు కల్పనకు లక్షలాది రూపాయలు సమకూర్చినట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపి అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈనెల 14న తిరుమలగిరిలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు పాలకూర్తి రాజయ్య, తిరుమలగిరి మున్సిపల్ చైర్ పర్సన్ అనసూర్యరాములు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలి

హోమ్ ఓటింగు విధానంలో ఓటు గోప్యతను కాపాడాలి



ప్రజాపక్షం / యాదాద్రి : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవలని జిల్లా ఎన్నికల అధికారి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంత్ కె. జండగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం(7) అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశమై భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈనెల 18 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన అప్‌డేటెడ్ ఓటర్ జాబితాలతో హెల్ప్‌డెస్క్‌లో సిద్ధంగా ఉండాలని, ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాలలో కూడా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, అప్‌డేటెడ్ ఓటరు జాబితాలతో వివరాలు అందించాలని తెలిపారు. నామినేషన్‌కు సంబంధించిన అన్ని ఫారంలపై హెల్ప్‌డెస్క్‌లో అభ్యర్థులకు సహాయం అందించాలని, పోటీ చేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటుహక్కు ఉన్నది లేనిది చూడడం, నామినేషన్ పత్రాల పూరింపు, జతచేయు పత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. స్టాటిస్టికల్ సర్వేవల్ టీములకు కావలసిన వసతులను కల్పించాలని, టీములు నిర్వహించే రిజిష్టర్లు సరిగా మెయింటైన్ చేసేలా పర్యవేక్షించాలని, చెక్‌పోస్ట్‌లను తరచూ పరిశీలిస్తుండాలని, టీముల షిఫ్ట్‌వారి డ్యూటీలను తనిఖీ చేయాలని, సిబ్బందికి ఐడి కార్డులు ఉండాలని సూచించారు. వీడియో సర్వైవల్ టీమ్స్,వీడియో వీవింగ్ టీమ్స్, అకౌంటింగ్ టీమ్స్ ద్వారా సరైన పర్యవేక్షణ చేయాలని, ఎన్నికల నిర్వహణ మెటీరియల్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలని, రికార్డుల ప్రకారం పూర్తిపేరు మెటీరియల్ పొందాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఇవిఎం యంత్రాల కోసం స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసుకోవాలని, ఫైర్ ప్రూఫ్ తదితర భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేయాలని, అందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన అందించాలని తెలిపారు. వాహనాలు, వీడియో గ్రాఫర్స్, వలంటీర్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు సంబంధించి వెబ్ కాస్టింగ్ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని, పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు తప్పనిసరిగా ఉండాలని, వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయం కల్పించాలని తెలిపారు. అత్యవసర విభాగాల సిబ్బందికి పోస్టల్ బాలట్, 85 సంవత్సరాల వయస్సు దాటిన సీనియర్ సిటీజన్లు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం నిబంధనల ప్రకారం నిర్వహించాలని, హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి ముందుగానే ఏ రోజు ఏ సమయానికి వస్తున్నది తెలుపాలని, నిబంధనల ప్రకారం హోమ్ ఓటింగ్ నిర్వహించాలని, ఓటు గోప్యత చాలా ముఖ్యమని, అవసరమైన పోలీస్ ఎస్కార్ట్ ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనగాం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పింకేశ్ కుమార్, జిల్లా ఉప ఎన్నికల అధికారి, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి. బెన్ షాలోమ్, భువనగిరి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్.డి.ఓ. అమరేందర్, ఆలేరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, మునుగోడు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.సుబ్రహ్మణ్యం, నకిరేకల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పూర్ణచందర్, తుంగతుర్తి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.ఎస్. లత, జనగాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.కొమరయ్య, ఇబ్రహింపట్నం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.అనంతరెడ్డి, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, తహసీల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవు



జిల్లా ఎస్‌పి చందన దీప్తి

ప్రజాపక్షం / నల్లగొండ: రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ మద్దతు ధరకు తక్కువ చెల్లించి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి చందన దీప్తి హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ఎగుమతి దిగుమతులు అలసత్వం చేయవద్దన్నారు. వేసవి నేపథ్యంలో అవసరమైతే ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, మిల్లుల వద్ద దిగుమతి చేసుకోకుండా కాలయాపన చేయరాదని, మిల్లు యజమానులు తూకం తక్కువగా వచ్చిందని మరోసారి తరుగు పేరిట మిల్లుల వద్ద ధాన్యం తరుగు ఇస్తేనే లారీ నుండి దిగుమతి చేసుకుంటామని ఇబ్బందులు పెట్టరాదని హెచ్చరించారు. కొనుగోలు దారులు తూకంలో మోసం గాని, తేమ, తాలు, పేరిట క్వింటాల్‌కు కొంత తరుగు అని చేస్తే మా వాట్స్ అప్ నంబర్ 8712670164 కి సమాచారం తెలిపితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఎఐవైఎఫ్ కార్యకర్త పగడాల భరత్ మృతి

పలువురు నేతలు సంతాపం



ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ : అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్త, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఏకైక కుమారుడు పగడాల భరత్‌కుమార్ (23) శుక్రవారం మృతి చెందా రు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న భరత్ ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. భరత్ మరణంతో ఖమ్మం కార్పోరేషన్ 14వ డివిజన్ కొత్తగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తండ్రి కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పనిచేస్తుండడంతో భరత్ అందరితో కలివిడిగా తిరుగుతూ ఉండేవాడు. పార్టీ కార్యక్రమాలు జరిగితే ముందు వరుసలో నిలిచే భరత్ మరణం గ్రామంలో ప్రతి ఒక్కరి కండ్లు చేమర్చేలా చేసింది. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు గాదె లక్ష్మినారాయణ, ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, నాయకులు ప్రతానపు రామనాథం, చింతకాయల వెంకటేశ్వర్లు, రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు రావూరి సైదబాబు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పి ఎ సిహెచ్ రవికిరణ్, పగడాల నాగరాజు తదితరులు భరత్ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఫోన్‌లో పగడాల మల్లేష్‌ను పరామర్శించారు. భరత్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. పగడాల భరత్ మృతి పట్ల పలువురు సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాప సానుభూతిని తెలియజేశారు. మల్లేష్‌తో చరవాణిలో మాట్లాడి ఓదార్చారు.



## ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టితో తగిన చర్యలు

కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి



ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి: కమిషనరేట్ కంప్లెయింట్ సెల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పేర్కొన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం కమిషనరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి నేర సమీక్షతో పాటు లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. చెక్‌పోస్టుల పనితీరుపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండ్ ఓవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ సమయాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను వివరించే సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో ఉండే ట్రబుల్ మొంగెర్స్‌ని ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలన్నింటినీ సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు.

### సిసిసి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

కమిషనరేట్ కంప్లెంట్ సెల్ ద్వారా పోలీస్ స్టేషన్లకు పంపించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై తగు చర్యలు తీసుకోవాలని, పరిష్కారమయ్యే సమస్యల పట్ల నాణ్యమైన విచారణ జరిపి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారెంట్లను, భౌతిక నేరాలకు సంబంధించిన వాటిని అమల్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులందరికీ అవగాహన కల్పించారు. ఎటువంటి ఉల్లంఘన అయినా సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి శాంతి భద్రతలు ఎ.లక్ష్మి నారాయణ, ఏసిపిలు శ్రీనివాస్(సిఎస్‌బి), నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్ జీ, మాధవి, విజయ్ కుమార్, వేణుగోపాల్, కాశయ్యలతో పాటుగా తదితరులు , సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మంత్రి కొండా సురేఖ





**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గెలిచిన మెదక్ గడ్డపై తిరిగి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మెదక్ పార్లమెంటు ఇన్చార్జీ మంత్రి కొండా సురేఖ అన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ దేవస్థానం వద్ద మంత్రి కొండా సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి నీలం మధుతో కలసి ఆమె మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌ను కాంగ్రెస్ పార్టీ చాలెంజ్‌గా తీసుకున్నదన్నారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ సెగ్మెంట్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో మెదక్‌ఎంపి అభ్యర్థిని గెలిపించే భాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని కలిసికట్టుగా పనిచేసి నిరూపించాలని మంత్రి సురేఖ కార్యకర్తలను కోరారు.

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్యే పోటీ : జగ్గారెడ్డి

మెదక్ పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు మధ్యే పోటీ ఉంటుందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బిసి బిడ్డ నీలం మధు ముదిరాజ్‌కు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని అతడి గెలుపు ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. మెదక్ కాంగ్రెస్ అడ్డా అని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. ఇందిరా ప్రాతినిధ్యం వహించిన మెదక్ సీటుపై కాంగ్రెస్ జెండా ఎగరేసేంత వరకు నిద్రపోయేది లేదన్నారు.

కార్యక్రమంలో శ్యామ్‌గౌడ్, పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గ ఇన్ చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

## అవినీతి, అక్రమాలతో... కల్వకుంట్ల కుటుంబానికి జైలు జీవితం తప్పదు

**గజ్వేల్ :** రాష్ట్రాన్ని అవినీతి, అక్రమాలతో పదేళ్లపాటు పాలించిన కల్వకుంట్ల కుటుంబానికి జైలు జీవితం తప్పదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హంన్మతరావు, పరిశ్రమల శాఖ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంక్షారెడ్డి, ఎన్నికల ఇన్చార్జి ప్రమోద్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సభలో మంత్రి ప్రసంగించారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా ఈ ప్రాంత పేద రైతులను ప్యాకేజీల పేరిట మభ్యపెట్టి నట్టేట ముంచిన బిఆర్‌ఎస్ అభ్యర్థి వెంకటరాంరెడ్డి ఏ ముఖం పెట్టుకొని తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు మరోసారి మాయమాటలతో ప్రజల ముందుకు వస్తున్నట్లు ఏద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హంన్మతరావు, డిసిసి అధ్యక్షులు, తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం నుంచి నీలం మధు కు మెజార్టీ వచ్చేలా కష్టపడదామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాయిని యాదగిరి, నిమ్మ రంగారెడ్డి,మొనగారి రాజు, రాములుగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్, రవీందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, లింగారావు, మోహన్, గోపాలరావు, సాజిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శీ కర్రె భిక్షపతి అన్నారు. ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెద్యాల గ్రామములోని శుక్రవారం రాజారపు రాజు అధ్యక్షతన ధర్మసాగర్ మండల సమితి సమవేశం జరిగింది. కార్యక్రమారి బిక్షపతి హాజరై మాట్లాడుతూ మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తే మనువాద రాజ్యాంగాని తీసుకవస్తారన్నారు. పది సంవత్సరాల బిజెపి పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాబిన్నమైందన్నారు. రైతులకు గిటుబాటు ధరలు కల్పించక మూడు నల్ల చట్టాలను తీసుకవచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇడి, సిబిఐ ప్రభుత్వరంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోని భారత రాజ్యాంగ విధానాన్ని కాల రాస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం లౌకికవాదం భారత రాజ్యాంగాన్ని కాపాడుటకోసం ప్రజలు చైతన్యం కావాలని కోరారు. కార్యక్రమములో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి,మండల కార్యదర్శీ కోట్టె వేంకటేశ్, రాజారపు రత్నం,రాజయ్య,దేవయ్య,గట్టయ్య,బుషణం తదితరులు పాల్గోన్నారు.

## ఆర్‌టిసి పరిరక్షణ ఉద్యమ కేసులు ఎత్తివేయాలి : అజయ్‌సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని పరిరక్షించాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల కోసం ఉద్యమంలో పాల్గొని అనేక పోరాటాలు నిర్వహించిన సిపిఐ నేతలు కార్యకర్తలపై నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోలీసులు పెట్టిన అక్రమ కేసుల్లో భాగంగా శుక్రవారం మహబూబాద్ జిల్లా కోర్టుకు సిపిఐ నేతలు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధిరెడ్డి మాట్లాడుతూ నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీనీ పరిరక్షించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సమ్మె చేస్తుంటే టిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులను తొలగిస్తామని బెదిరిస్తూ వారిపై లాటి చార్జీలు చేపించి, అనేకి కేసులు పెదుతుంటే వారికి మద్దతుగా సిపిఐ పెద్దఎత్తున ఆర్టీసీ కార్మికుల కోసం ఉద్యమించిందన్నారు. ఆనాడు పోలీసులు సిపిఐ నేతలు కార్యకర్తలపై అనేకసార్లు అరెస్టులు లాఠీచార్జీలు చేశారన్నారు. ఆరోజు టిఆర్‌ఎస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల అనేకమంది ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అనేకమందిపై అక్రమ కేసులు బనాయించారని, సిపిఐ పోరాట ఫలితంగా ఆర్టీసీని పరిరక్షించుకొని కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించడంలో సిపిఐ పెద్దన్న పాత్ర పోషించిందన్నారు. సిపిఐ నేతలపై కార్యకర్తలపై పోలీసులు కేసీఆర్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. నాటి కేసులో భాగంగా జిల్లా కోర్టుకు 40 మంది సిపిఐ నేతలు కార్యకర్తలు కోర్టుకు హాజరయ్యారని ఆయన తెలిపారు. హాజరైన వారిలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బిఅజయ్‌సార్ధిరెడ్డి, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మంద శంకర్, ఎర్రోజు పద్మ, ఎండి షంషీర్, కూరాకుల పాల్, ఎండి అలీమా, తండ మాధవి, స్వరూప, రమ, కవిత, బిచ్చా నాయక్, పవన్, లక్ష్మణ్, లక్ష్మీనర్సు, తండ వినోద, రామ, నర్సు, మధుకర్, శారద, బాలాజీ, కోన సత్యం, నగేష్, శ్రీను, బాలు పాల్గొన్నారు.

## సామాజికవేత్త జ్యోతిరావు పూలే



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజికవేత్త మహాత్మాజ్యోతిరావు పూలే అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమన్నారు. వారి ఆదర్శాలు, ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని చెప్పారు. సమ సమాజ స్థాపనకు కృషి చేసిన గొప్ప మహనీయుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని అన్నారు. అట్టడుగు ప్రజలను అంటరాని వారిని విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేసిన జ్యోతిరావు పూలే జీవితం అందరికి ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా,మనోహర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాల కోసం కృషి చేయాలి : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/వరంగల్ :** నేటి యువత జ్యోతిరావు పూలే ఆశయాల కోసం కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మస్క సుధీర్ లు అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్ తమ్మెర భవన్ ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సంఘ సంస్కర్త అని, కుల, మత, లింగ అసమానతలపై పోరాడిన యోధుడన్నారు. అనేక పాఠశాలలను ప్రారంభించి అణగారిన వర్గాల విద్య కోసం పాటుపడిన మహనీయుడు పూలే అన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్య అందినప్పుడే జ్యోతిరావు పూలేకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మౌటం శివ కుమార్, సంతోష్, ప్రభాస్, అభిరామ్, రాజు, ఖలీల్, సందీప్, జగదీష్, సుమన్, శ్రీకాంత్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల పనులు పూర్తి చేయాలని గ్రామస్తుల నిరసన



**ప్రజాపక్షం /నల్లబెల్లి :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మంజురు చేసిన బిటి రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రోడ్లు మంజురైన గ్రామస్తులు గులాభి పువ్వులతో రోడ్లపై నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పూలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక జీవోలతో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు బిటి రోడ్లు వేయుటకు నిధులను తీసుకు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను రద్దు చేసిందని, వెంటనే మంజురైన నిధులను తెచ్చి గామాల్లో మొదలైన బిటి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి ప్రజల సౌకర్యలను మెరుగు పర్చాలని ప్రజలు కోరుతున్నారు . కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్ ,మాజీ సర్పంచులు గోనే శ్రీదేవి ,అమరేంధర్ ,కూస కొంరెల్లి ,కిషోర్ తదితరులు పాల్గోన్నారు .

## రాహుల్ నాయకత్వాన్ని దేశం కోరుకుంటుంది

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/కొత్తగూడ :** రాహుల్ గాంధీ నాయకత్వాన్ని దేశం కోరుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని వెలుబెల్లిలో కొత్తగూడ, గంగారం మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి పోరిక బలరాంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ బలరాం నాయక్ గతంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు పార్లమెంట్ పరిధిలో ఎన్నో అబివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. నరేంద్రమోడీ ప్రజలపై అధిక పన్నుల భారం మోపి ప్రజా సమస్యల కోసం పని చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నాడని ఆరోపించారు. టెక్నలాజీ పెరిగిందని గొప్పలు చెప్పే మోడీ ఎన్నికల కోడ్ 70 రోజులు విధించి తన ప్రచారానికి అనుకూలం చేసుకున్నాడని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాల్పరించిన కుటుంబం రాహుల్‌గాంధీ కుటుంబానిదని ఆయన దేశాన్ని ఐక్యత చేయడం కోసం యాత్ర చేశాడని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నా తల్లి లాంటి నియోజకవర్గానికి ఎల్లవేళలా కాపాడుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలను లీడ్ చేయాలని, ప్రజల్లో మమేకం కావాలని సూచించారు.



## అబివృద్ధిలో సీతక్కతో భాగమైతా : బలరాం నాయక్

మహబుబాబాద్ పార్లమెంట్ పరిధీలో జరిగే అభివృద్ధిలో మంత్రి సీతక్కతో భాగమైతానని ఎంపి అభ్యర్థి బలరాం నాయక్ అన్నారు. బిజేపి ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరిచిందని ఆరోపించారు. కార్యక్రమంలో ములుగు డిసిసి అధ్యక్షుడు పైడాకుల ఆశోక్, డాక్టర్ అనిల్, కొత్తగూడ, గంగారం మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, జాడి వేంకటేశ్వర్లు, ఎంపీపీలు బానోతు విజయ, సరోజన, జడ్పిటీసీలు పుష్పలత, రమ, చల్లా నారాయణరెడ్డి, డిసీసీ కార్యదర్శి రూప్‌సింగ్, నాయకులు మొగిళి, వెలుబెల్లి వజ్జ వేంకటలక్ష్మి సురేందర్, అల్లాడీ రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు ఏమాయే : ఎంఎల్ఎ సునీత



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌ను చిత్తు చిత్తుగా ఓడిచాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలంలో శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో వెల్దుర్తి, మాసాయిపేట కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మెదక్ గడ్డ మీద గులాబీ జెండా ఎగురవేయడం ఖామయని సునీతారెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దోఖా చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరం పొలం ఎండిపోలేదని, నేడు 20లక్షల ఎకరాల్లో పంట ఎండిందన్నారు. కళ్యాణలక్ష్మీ తో తూలం బంగారం పక్కన పెడితే లక్ష కూడా రావడం లేదన్నారు. జీరో బిల్లు లేదంటున్నారన్నారు. మహాలక్ష్మి పథకంలో రూ.2500 ఏమైందన్నారు. రాష్ట్రంలో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు జాతీయ మెనిఫెస్టో అని వస్తున్నారని ప్రజలు గమనించాలన్నారు. మాయమాటల రఘునందన్‌రావుకు దుబ్బాకలో ప్రజలు చిత్తుగా ఓడించారని, ఎంపీ ఎన్నికల్లో డిపాజిట్ దక్కదని ఆమె అన్నారు. అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన 90 రోజుల్లో రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి సేవ అందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి ట్రస్టు ద్వారా నిరుపేదల కుటుంబాల విద్యార్థులు ఉచిత కోచింగ్, వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు నర్సాపూర్‌లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, జడ్పిటీసీ రమేష్ గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌నాయక్, కృష్ణగౌడ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలి

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య



**ప్రజాపక్షం/వరంగల్ :** బిజెపిని ఓండించి, వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు నాగయ్య అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో వరంగల్ ఉర్సు గుట్టలోని సిపిఎం ఆఫీస్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నమాల అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారం వ్యవసాయరంగానికి చేయూతనియాల్సింది పోయి కార్పోరేటీకరణ చేయడం కోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే దానికి సంవత్సర కాలంగా సుమారు 750మంది రైతులు ప్రాణత్యాగం చేసి వేలాది మంది రైతులుఉద్యమాలు చేస్తే పటిటచుకున్న పాపానపోలేదని విమర్శించారు. కులాల పేరు, మతాల పేరుతోటి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నటువంటి బిజెపిని ఓడించి భారత రాజ్యాంగాన్ని మనువాదుల చేతుల నుండి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు, ముక్కెర రామస్వామి, భూక్య సమ్మయ్య, ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటి సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను చంపి దంపతుల ఆత్మహత్య

**ప్రజాపక్షం/ గార్ల :** ఇద్దరు పసికందులకు పాలలో విషమిచ్చి కడతేర్చిన తల్లిదండ్రుల కథ విషాదంగా ముగిసింది, వారు కూడా అడవిలో ఉరివేసుకుని హత్మహత్యకు చేసుకున్నారు. గార్ల మండలం అంకన్న గూడెం గ్రామానికి చెందిన అనిల్ దేవి దంపతులు అంకన్న గూడెం నామాలపాడు మధ్యలో గల అటవీ ప్రాతంలోని కొండపై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు శుక్రవారం పోలీసులు గుర్తించారు. గత నెల మార్చి 10న తమ పిల్లలు లోహిత (3) జశ్విని (1) చిన్నారులకు పాలలో పురుగుల మందు కలిపి హత్య చేసి పరారైయ్యారు. పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నా ఆచూకీ లబించలేదు. కుటుంబ సభ్యులు దంపతుల కొరకు గాలిస్తుండగా గత పదిహేను రోజుల క్రితం వారు హత్మహత్య చేసుకున్న ప్రాంతానికి సమీపంలోనే అనిల్ ద్విచక్ర వాహనం లభించగా దానిని వారు పోలీసులకు అప్పగించారు. పది రోజుల నుంచి పోలీసు బలగాలు అంకన్నగూడెం, నామాలపాడు, చుట్టు ప్రక్కలగల అటవీ ప్రాంతాలలో గాలిస్తున్న సందర్భంలో నామాల పాడు నుండి ఐదు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో రెండు కిలో మీటర్ల ఎత్తైన కొండపై ఉరివేసుకుని ఉన్న దంపతుల మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అనిల్ మృతదేహం చెట్టుకు వేలాడుతుండగా, దేవికి సంబందించి బట్టలు పుర్రె ఎముకలు మాత్రమే మిగిలాయి. పోలీసులు వారి బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి కొండపైనే దహనం చేశారు. వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిజెపికి ఓటేస్తే..పెనం పైనుంచి పొయ్యిలో పడ్డట్లే

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ మీద కోపంతో బిజెపికి ఓటేస్తే పేనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనని మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశంలో భాగంగా పట్టణ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే అన్నారు. బిఆర్‌ఎస్ పదేండ్లు పాలించిందని, కాంగ్రెస్ నాలుగేండ్లలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. సిద్దిపేటలో సగం కట్టిన వెటర్నరీ కళాశాలను రద్దు చేసి కొడంగల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి తరలించారన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అని గంబీర ఉపన్యాసాలు ఇచ్చారని, ఇప్పుడేమో సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి దగ్గర సరుకు లేదని, పనిలేదన్నారు. ప్రజలకు కాంగ్రెస్ మీద కోపం వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దుబ్బాకలో గత ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు ఇంటికి రెండేండ్లు, నిరుద్యోగ భృతి ఇస్తానని, రైలు తెస్తానని అబద్దాలు చెప్పి ఉప ఎన్నికల్లో గెలిచారని, హామీలు నేరవేర్చకపోతే మొన్నటి ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టినట్లు తెలిపారు. బిజెపిని ఓడించే శక్తి బిఆర్‌ఎస్‌కు ఉందని ముస్తీం సోదరులు గుర్తించినట్లు తెలిపారు. ఇచ్చిన హామీలు తప్పిన కాంగ్రెస్ మెడలు వంచాలంటే ఎంపి ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. గులాభి జెండాకు ప్రాణం పోసింది సిద్దిపేటనే అన్నారు. సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కోడంగల్‌కు తరలించారని, సిద్దిపేటలో వివిధ అభివృద్ధి పనులు 150 కోట్ల రోడ్డు పనులు రద్దు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్, బిజెపి పార్టీలు రెండు అక్కసువెళ్ల బుచ్చాయన్నారు. అలాంటి వారికి సిద్దిపేటలో ఓట్లు ఏలా వేస్తామని ప్రశ్నించారు. సిద్దిపేట అంటే ప్రత్యేకత గౌరవం ఉందని, ఆ ప్రత్యేకతను మరోసారి చాటుదామన్నారు. తెలంగాణ హక్కులు, అభివృద్ధిపై బిఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినిపించేదుకు వెంకట్రామ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు. వైస్ చైర్మన్ కనకరాజు, నాయకులు ఎల్లు రవీందర్‌రెడ్డి, పాల సాయిరాం, పూజల వెంకటేశ్వరరావు, భూపేశ్, మోహన్‌లాల్, మోయిజ్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బర్లమల్లికార్జున్ , బూర విజయ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష







**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** రైతుల ధాన్యం విక్రయాల్లో దళారులు ప్రవేశించి సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ హెచ్చరించారు. శుక్రవారం జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మాట్లాడుతూ రైతులు విక్రహించే ధాన్యం కొనుగోళ్లు సంబంధిత అధికారుల నేతృత్వంలో జరుగుతుందని, ఎవరు అధైర్య పడవద్దన్నారు. ధాన్యం విక్రయాల్లో సమస్యలు సృష్టిస్తే కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్‌రూం నెంబర్ 6303928718 కి పోన్ చేయాలన్నారు. జిల్లాలో 195 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2023లు, బి గ్రేడ్‌కు 2183 రూపాయలు ధన లభిస్తుందన్నారు. రైతులు నిబంధనలు పాటించి ధాన్యం తీసుకురావాలని కోరారు. నాన్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రహించాలన్నారు. జిల్లాలో 62 రైతు వేదికల్లో వ్యవసాయానికి సంబంధించి అధికారులతో సమీక్షలు నిర్వియించామన్నారు. 17 శాతం తేమ ఉండే విధంగా రైతులు చూడాలని, ధాన్యాన్ని ఆరబెట్టి తేవడం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ మార్కెట్‌లో పర్యటించి ధాన్యం విక్రయాలను పరశీలించారు. కలెక్టర్ వెంట పౌసరఫరాల శాఖ అధికారి రోజారాణి, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, సవిల్ సప్లయ్ మేనేజర్ ప్రసాద్, మార్కెటింగ్ అధికారి నరేంద్ర పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పెంబర్తితో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

**పర్వతగిరి:** ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్వతగిరిలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలు, సిబ్బందితో మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తీసుకొచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలన్నారు. తేమ శాతం 17 శాతం కంటే తక్కువగా ఉంటే వెంటనే కాంటాలు పెట్టి ట్రాన్స్‌పోర్టు చేసి ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుకు డబ్బులు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కౌసల్యదేవి, డీఎంఓ సంధ్యారాణి, డీపీఎఫ్ఓ శివప్రసాద్‌రెడ్డి, తహసీల్దారు వెంకటస్వామి, డీపీఎం భవాని, ఏపీఎం సుధాకర్, తోటకూర కృష్ణమూర్తి, సీసీలు కాంతయ్య, సుధాకర్, వీఓఏలు రజిత, జ్యోతి, రమేశ్, కరుణ, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

**రాయపర్తి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరపాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పెరికేడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కౌసల్య దేవి, డిఎంఓ సంధ్యారాణి, డిసిఎస్ఓ శివప్రసాద్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, డిపిఎం భవాని, ఏపిఎం సుధాకర్, సీసీలు దేవేంద్ర, అనిత, యాదగిరి, విఓఏ లు రమాదేవి, మంగమ్మ, దివ్య, పుష్ప, శ్రీలత, కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లా మల్యాలమండలం రామన్నపేట తిరుమలాపూర్‌లో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ పి. రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల నందు నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందువల్ల కొనుగోలు కేంద్రాల యందు నీటి సౌకర్యం, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల సివిల్ సప్లై డిటి శ్రీనివాస్, మల్యాల సివిల్ సప్లై ఇన్స్‌ఫెక్టార్ స్వామి, సంబంధిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు

## కాంగ్రెస్‌లోకి పలువురి చేరికలు



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** బిజెపికి చెందిన వీరమల్ల రాజయ్య (పాల రాజు), రెల్లి కులస్తులు, పాడి రైతు సంఘం నాయకులు 300 మంది చెన్నూరు ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎంఎల్ఏ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క వర్గానికి న్యాయం జరుగుతుందని, ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా కృషి చేస్తామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, రఘునాథ్ రెడ్డి, గోపతి రాజయ్య, ఓడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ సాగర్ రెడ్డి, అఫ్జల్ లాడెన్, మహంకాళి శ్రీనివాస్, శ్యామ్ గౌడ్, గోపతి భానేష్, ఉప్పులపు సురేష్, పలిగిరి కనకరాజు, మహిళా నాయకురాలు దీపా, కమల తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ చర్చకు సిద్ధమా..!

పిసిసి సభ్యుడు గోగూరి మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన అప్పటి పార్లమెంట్ సభ్యులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి హోదాలో ఉన్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలో ఇలవేల్పు అయినటువంటి కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం చేసుకొని పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధిష్టానుసారం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపుకై ప్రచారం ప్రారంభించన ఆయన పైన బిజెపి పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ మండల స్థాయి అనుచర బృందం చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ గురువారం రోజున పిసిసి సభ్యులు గోగూరి మహిపాల్ రెడ్డి కొడిమ్యాల మండల కేంద్రంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులపై తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న బండి సంజయ్ మండలానికి చేసిన అభివృద్ధిపైన, తెచ్చిన నిధులపైన శ్వేత పత్రం విడుదల చేసి బహిరంగ చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే కాకుండా బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్ అంతకన్న ముందు కెసిఆర్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏమి అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన అన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి చూపించడం అవసరం లేదని ప్రజల మనస్సులో, కళ్లముందే కనిపిస్తోందని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆకాశం పైన ఉమ్మినట్లు ఉంటుందని ఆయన అన్నారు. అభివృద్ధి పథకాలు నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరి నారాయణగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి, బిసిసెల్ నాయకులు మల్లేశం, చంద్రమోహన్ రెడ్డి, బండి లక్ష్మీరాజం, రాజమల్లు, గంగయ్య, కిసాన్ సెల్ అధ్యక్షులు రాఘవరెడ్డి, సురేందర్, నర్సయ్య, రవి, శంకర్, తిరుపతి, లక్ష్మారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు చొక్కాల నాగార్జున్, సాయి, మధు, కళ్యాణ్, రంజిత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు వంశీ, సన్నీ తదితరులు ఉన్నారు.

## చదువుకు పేదరికం అడ్డు కాదు



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కోసిని గ్రామానికి చెందిన సర్పంచ్ నగనూరి నీరజ శ్రీనివాస్ గౌడ్‌ల ఏకైక పుత్రిక నగునూరి మౌనిత కాళోజి యూనివర్సిటిలో ఐదున్నర సంవత్సరాలు ఎంబిబిఎస్ విద్యను చదివి, కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రిలో వైద్య రంగంలో శిక్షణ పొంది వైద్య పట్టా అందుకున్న సందర్భంగా మౌనితను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మౌనిత మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, తన చిన్ననాటి నుండి తన పేరుకు ముందు డాక్టర్ అని ఉండాలనే కోరిక ఉండేదని, దాన్ని సాకారం చేసుకునేందుకు అహర్నిషలు శ్రమించానని తెలిపారు. వైద్య వృత్తిలో పేదలకు సేవలు అందిస్తానని తెలిపారు. మౌనితను అభినందించిన వారిలో పట్టణ వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**ప్రజాపక్షం/వీణవంక :** కరీంనగర్ జిల్లాలో వీణవంక మండలంలోని కనపర్తి గ్రామ శివారులో గల మేకల నారాయణ రెడ్డి వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసిన సంఘటన చోటు చేసుకుంది. పక్కా సమాచారం తో వీణవంక ఎస్సైతో పాటు సిబ్బంది పేకాట ఆడుతున్న స్థలంలో అటుకుల మహేందర్ , ఉయ్యాల బిక్షపతి, అడిగొప్పుల మల్లేశం, బూర్తుల ప్రకాష్, యాలం రమణారెడ్డి, మెడగోని తిరుపతి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, నల్ల కోమల్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి, పర్లపెల్లి తిరుపతి, ఉయ్యాల శ్రీనివాస్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.49,760 లు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.



## భూగర్భ జలాల సంరక్షణ కోసం

# ఇసుక టెండర్లు రద్దు చేయండి

ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ డిమాండ్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మానేరు పరీవాహక ప్రాంత పరిధిలో ఇసుక టెండర్లు వేయడం మూలంగా భూగర్భ జలాలు అడుగంటిపోయయని ఎఐటియుసి పెద్దపల్లి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్‌ల టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామంలో గత ఏడు రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలను సందర్శించి వారికి ఎఐటియుసి, సిపిఐ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కడారి సునీల్ మాట్లాడుతూ మానేరు పరివాహక ప్రాంత పరిధిలోని గ్రామాలలో మునుపెన్నడూ లేని విధంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు, తాగునీరుకు తీవ్ర ఎద్దడి నెలకొందని దానికి ప్రధాన కారణం ఇసుక టెండర్ల విధివిధానాలే అని అన్నారు. హైదరాబాద్ బిల్డర్లకు రియల్ ఎస్టేట్ దందాలకు మానేరు ఇసుక హైదరాబాద్‌కు వేల లారీలు ధ్వరా తరలించడం మూలంగా రహదారులని విధ్వంసం అయ్యాయని అన్నారు. మానేరు జలాలు అడగంటి పోవడం మూలంగా గ్రామాల్లోని వ్యవసాయ బావుల ఉటలు పూర్తిగా అడుగంటిపోయి పంటలు ఎండిపోయాయని అన్నారు. ఎండలు మండుతున్న తాగునీరుకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఇసుక టెండర్లను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజారామ్, ప్రసాద్, శంకర్, రవి, రాజిరెడ్డి, ఉపేందరస్యత్యం, మల్లన్న రాయమల్లు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సేవకుడిగా మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించండి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థానిక మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ అయిల రమేష్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాకర్స్‌తో చేపట్టిన మార్నింగ్ వాక్‌లో పెద్దపల్లి ఎంపి అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంఎల్ఏ దాసరి మనోహర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపి అభ్యర్థిగా వస్తున్నా అని, కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్స్‌కి విజ్ఞప్తి చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేయడానికి కెసిఆర్ అవకాశం కల్పించారని అన్నారు. ఈ సందర్భంగా మీ అందరి మద్దతు కావాలని కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. వాకర్స్‌తో ప్రచారం నిర్వహించిన అనంతరం కూరగాయల మార్కెట్‌లో, కాలేజీ కాంప్లెక్స్ దుకాణాలలో, రాజీవ్ రహదారికి ఇరువైపులా దుకాణాలలో వ్యాపారులతో కొప్పుల ఈశ్వర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, ఎంపిపి బాలాజీ రావు, వాకర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బైరగొని రవీందర్ గౌడ్, మంద శ్రీనివాస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోట్ల విలువైన దేవాలయ భూములు ఆక్రమణ

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రాంతంలో విశ్వనాథ దేవాలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సిరిసిల్ల నడిబొడ్డున కోట్ల విలువైన భూముల్ని కొందరు రాజకీయ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎండోమెంట్, రెవెన్యూ సర్వేయర్లు సర్వే చేసి మూడు గంటల దేవాలయ భూమి ఆక్రమణకు గురైందని తేల్చారన్నారు. 27 ఫీట్ల రోడ్డును 40 ఫీట్ల రోడ్డుగా చూపించి అక్రమ లేఅవుట్ చేశారన్నారు. అక్రమంగా దేవుని భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని దేవాలయ భూములను కొల్లగొట్టారన్నారు. ఇలాంటి భూకబ్జాలకు పాల్పడుతున్న నాయకులపైన కేసులు పెట్టి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ లే అవుట్‌కు సహకరించిన మున్సిపల్ అధికారులను, సర్వేయర్లను సస్పెండ్ చేయాలని సిపిఐ పక్షాన కోరారు.సమావేశంలో సిపిఐ నాయకులు సోమ నాగరాజు, ఆజ్జ వేణు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ధర్మపురిలో కేంద్ర బలగాల కవాతు



**ప్రజాపక్షం/ధర్మపురి:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డిఎస్‌పి రఘు చందర్, ఎఆర్ అదనపు ఎస్‌పి భీం రావు, ఎఆర్ డిఎస్‌పి రవీందర్ రెడ్డి, ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్, నందీ చౌక్, అంబేద్కర్ చౌక్‌ల మీదుగా కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా ఎఎస్‌పి భీం రావు, డిఎస్‌పి రఘుచందర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలలో భాగంగా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సిఐ ఎలపాటి నర్సింహరెడ్డి, పారా మిలిటరీ ఇన్స్పెక్టర్ ఎగ్జిక్యూటివ్ యోగేందర్ సింగ్, ఎఆర్ సిఐ వేణు, ఎస్ఐ ఉదయ్ కుమార్, సతీష్, శ్రీధర్ రెడ్డి, ఉమాసాగర్, 200 మంది పారా మిలిటరీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



సిరిసిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జీ కెకె మహేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** బిజెపి, బిఆర్ఎస్ దొందు దొందేనని దేశంలో రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తీసుకొచ్చి రైతులపై భాష్పవాయువు ప్రయోగించారని బిజెపి, బిఆర్ఎస్‌లను బొందపెట్టాలని రాజన్న సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన నూతనంగా చేరిన కాంగ్రెస్ పార్టీలోకి మున్నూరు కాపు సంఘం నాయకులు, బిఆర్ఎస్‌లో ఉన్న తాజ మాజీ సర్పంచ్ భర్తలు దాసరి మహేందర్, కదిరె శ్రీనివాస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. భారతదేశాన్ని కాపాడుకోవాలంటే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ కార్యకర్తలు లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అధిక మెజారిటీ ఇచ్చి రాహుల్ గాంధీని ప్రధానిని చెద్దామని కార్యకర్తలు సహకరించి అవినీతి పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిలను చిత్తుగా ఓడించాలని దేశాన్ని కాపాడుకోవాలని మహేందర్ రెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఆరు గ్యారంటీలు ఇచ్చిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ప్రజలకు సేవకులమే ఆని పాలకులం కాదు అని సందేశాన్ని చ్చారు. ప్రజలకు హామి ఇస్తున్న తరుణంలో రాష్ట్ర ఖజాన ఖాళీ చేసిన ఘనత బిఆర్ఎస్ యేనని విలేకరుల సమావేశంలో నిప్పులు చెరిగారు. బిఆర్ఎస్ అవినీతి ఆరోపణలపై రోజు టీవిలలో వస్తున్నాయని లిక్కర్ స్కాం, ఫోన్ ట్యాపింగ్, భూకబ్జాలు ఆరోపణలపై సిరిసిల్ల ఎంఎల్ఏ కెటిఆర్ సమాధానం చెప్పాలని కేకే మహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, రేవంత్‌రెడ్డి టీం గూడ విజయ్‌రెడ్డి, మండలధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపధ్యక్షులు లింగం గౌడ్, కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ ప్రొసీడింగ్స్ ఇచ్చినందుకే కొప్పుల ఓటమి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో ఫేక్ ప్రొసిడింగ్స్ చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గత ఎన్నికల్లో ప్రజలు ఓడించి తగిన గుణపాఠం చెప్పారని, అదే సమయంలో మూడు పర్యాయాలు ఓడినా ప్రజల మధ్య ఉండి బాగోగులు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి పోరాడిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను గెలిపించారని జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎంఎల్ఏ అడ్లూరి నివాసంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలోని గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్‌మీట్ అడ్లూరిపై చేసిన ఆరోపణలను ఆమె తిప్పికొట్టారు. నిజానికి మూడు సార్లు కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయనందునే ప్రజలు అయన్ను తిరస్కరించిన విషయం అందరికి తెలిసిందేనని అన్నారు. కోట్లాది రూపాయల నిధులు తెచ్చానని తప్పుడు జీవో కాపీలు చూపి తప్పుదోవ పట్టించారని ఆమె ధ్వజమెత్తారు. రైతాంగానికి న్యాయం చేయని కొప్పుల ఈశ్వర్ కపట ప్రేమతో దీక్షలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్క హామీ అమలు అవుతుందని రైతు భీమా, రైతు బంధుతోపాటు ఏ ఒక్క పథకం ఆగలేదని ఆమె తెలిపారు. అబద్ధపు ప్రచారం మానుకోవాలని నాగలక్ష్మి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు జక్కు పద్మ, సంగనబట్ల సంతోషి, గరిగె అరుణ, నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, కుంట సుధాకర్, జక్కు రవీందర్, రాందేని మొగిలి, సంగ నర్సింహులు, రఫియోద్దిన్, సుముఖ్ పాల్గొన్నారు.

## న్యాయవాదులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఎంఎల్‌సి జీవన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదులకు అన్ని విధాల అండగా ఉంటుందని, ప్రజలు మార్పును కోరుకోవడం జరుగుతుందని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వ మోసపూరిత హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని నిజామాబాద్ పార్లమెంట్ ఎంపిగా ఎంఎల్‌సి జీవన్‌రెడ్డిని గెలిపించాలని నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి జీవన్‌రెడ్డని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదులకు సమస్యలన్నింటిని పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలు సాధిద్దాం : ఎంఎల్ఏ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలు సాధించాలని, ఆయన మార్గంలో అందరం నడవాలని, ఖానాపూర్ ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యశోధక్ సంస్థను స్థాపించి, అనగారిన వర్గాలను, చీకటి నుండి వెలుగులోకి నడిపించిన పూలే మార్గం ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రాజుర సత్యం, కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు, దొనికేని దయానంద్, నిమ్మల రమేష్, జన్నారపు శంకర్, అంబేద్కర్ సంఘం నాయకులు మేసా సతీస్, మునుగురి నవీన్, నేత శ్యామ్ తదితరులు ఉన్నారు.

# గోదాట్లో ఇసుకాసురులు

ఇసుక తరలింపు మాటున కోట్ల రూపాయల లూటీ

పేరుకే గిరిజన సొసైటీలు పెత్తనమంతా గుత్తేదారులదే

చెల్లుబాటు కానీ నిబంధనలు - అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పిరమైన ఇసుక గుత్తేదారులకు, వారికి సహకరించే వారికి కాసులు కురిపిస్తుంది. ఒక్క ఏడాది ఇసుక తరలింపు అవకాశం దక్కితే చాలు కోట్ల రూపాయల ఆస్తి వనగూరినట్లే. ఆరు శాఖల అధికారులు ఇసుక తోలకాలను , తరలింపును పర్యవేక్షించాల్సి ఉండగా ఏ శాఖ ఆ వైపు కన్నెత్తి చూడదు. తమకు రావాల్సినవి రాకపోతే ప్రభుత్వ వాహనాలు అలా ఓసారి క్వారీ ల వైపు వెళ్తాయి. ఇసుక తవ్వకాలు ఎక్కువ భాగం గిరిజన సొసైటీలకే అప్పగించినా వారికి ఇందులో ఒరిగేది ఏమి లేదు. పేరు గిరిజనులది ధనార్జనంతా గుత్తేదారులు, గిరిజనేతరులదే. దొంగలు పంటెత్తుకుపోతే రైతు పరిగ ఎరుకున్న సామెతే గిరిజనులది. చాలా మంది సొసైటీ సభ్యులకు సొసైటీల్లో ఏమి జరుగుతుందో తెలియదు. మహా నగరాలకు చెందిన గుత్తేదారులు స్థానికంగా వారి బినామీ దారులు గోదావరి ఇసుకపై పెత్తనం చెలాయిస్తుంటారు. కొందరు గిరిజనులను వెంటేసుకుని సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తే బెదిరిస్తారు. గిరిజనేతరులు ప్రశ్నిస్తే ఎస్సి, ఎస్టి, అట్రాసిటీ కేసులంటూ భయపెడతారు. గోదావరి పరివాహక ప్రాంతమంతా ఇసుకాసురుల పెత్తనమే. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దిపల్లి క్వారీ గుత్తేదారులు వారి బినామీలు లూటీలో అగ్రభాగాన నిలిచారు. వారిని ప్రశ్నిస్తే చాలు ఇప్పుడు ప్రాణాలు తీసే పరిస్థితికి ఎగబాకారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం చేష్టలుడిగి చూస్తుండడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనలు ఇతరత్రా కారణాలతో ఇసుక పిరమైంది. భవన నిర్మాణదారులకు ఇసుక కొనుగోలు తలకు మించిన భారంగా మారింది. అదే ఇసుక గుత్తేదారులకు కోట్ల రూపాయలు సమకూర్చిపెడుతుంది. ఎప్పుడైతే ఇసుక తరలింపు, తవ్వకాలు లాభాలను తీసుకు వస్తున్నాయో అక్రమార్కులు ఆ వైపు కన్నెశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం గిరిజన సొసైటీల ద్వారా ఇసుక తరలింపుకు అవకాశం కల్పించింది. ఇదే కొందరికి వరంగా మారింది. గిరిజన సొసైటీలలో సభ్యులుగా ఉండే వారిని నామ మాత్రం చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సాండ్ క్వారీ కమిటీలు, టిఎస్ఎండిసి జనరల్ మేనేజర్‌తో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఏ ప్రభుత్వ నిబంధనను పాటించడం లేదు. పర్యావరణ చట్టం 2002 కానీ, కన్సర్వేన్సీ చట్టం 1984 కానీ ఇప్పుడు గోదావరి ఇసుక తరలింపులో పాటించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన చోట రెండు మీటర్ల వరకు మాత్రమే ఇసుకను తోడాల్సి ఉంది. అక్కడ కూలీలతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డు వద్దకు తరలించాల్సి ఉంది. కానీ కేటాయించిన చోట కాకుండా వేరే ప్రాంతాలలో ఇసుకను తోడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మీటర్లు కాకుండా అంత కంటే ఎక్కువ లోతు నుంచి ఇసుకను తోడుతున్నారు. గోదావరిలోకి యంత్రాలను దింపి అక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నారు తప్ప ఎక్కడ కూలీలతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి డంపింగ్ వద్దకు తరలించిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్‌లో ఇసుక తరలింపు ప్రారంభమైన తర్వాత అదనంగా ఇసుక లోడు చేయడం ద్వారా కాంట్రాక్టర్లు ఒక్కో లారీకి రూ. 2వేల నుంచి లారీ సామర్థ్యాన్ని బట్టి ఐదు వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అదనంగా ఇసుక తరలించడం ద్వారా ప్రభుత్వం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఇసుక లారీలకు అదనంగా ఇసుకను లోడ్ చేస్తే (ఓవర్ లోడ్) పెద్ద మొత్తంలో జరిమానా విధించాల్సి ఉంటుంది. జరిమానాల సంగతి సరే అసలు ఇసుక లారీలను తనిఖీ చేసే వారే లేకుండాపోయారు. టిఎస్ఎండిసి అధికారులు ఎక్కడ ఉన్నారో ఎవరికి అర్థం కారు. గోదావరి పరివాహక ప్రాంతం డంపింగ్ యార్డు నుంచి ఓవర్ లోడ్‌తో లారీ బయలుదేరగానే అధికార యంత్రాంగానికి సమాచారం వస్తుంది అంతే వారెవ్వరు రోడ్డుపై కనిపించారు. కానీ గుత్తేదారులకు సహకరించని లారీలు వస్తే వెంటనే అధికారులు చుట్టుముట్టి పోలీస్ స్టేషన్లకు తరలిస్తుంటారు. ఇసుకను నిబంధనలకు లోబడి కాకుండా లోతు నుంచి తవ్వితే జరిమానా విధించాల్సి ఉంటుంది. కానీ లోయలను తలపించే రీతిలో గోదాట్లో ఇసుక తోడుతున్న ఏ ఒక్కశాఖ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. గోదావరిలో ఇంత తతంగం జరుగుతున్న అటు ఉన్నతాధికారులు కానీ, ఇటు జిల్లా అధికార యంత్రాంగం కానీ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. గిరిజన సొసైటీ సభ్యులకు ఇసుక తరలింపు ద్వారా ఉపాధి కల్పించాలనే లక్ష్యం దారితప్పి నగరాలలో నివసించే గుత్తేదారులకు, స్థానికంగా ఉండే వారి బినామీలకు పెద్ద మొత్తంలో ఉపాధి దొరుకుతుంది. సొసైటీ సభ్యులు ఏదైనా ప్రశ్నిస్తే అమాయక గిరిజనులను వేధింపులకు గురి చేస్తున్నారు. మీరేం చేస్తున్నారు అంతా చేసేది మేమే ఇలా ప్రశ్నిస్తే గోదాట్లోకి దిగరంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. గిరిజనుల పక్షాన సామాజిక కార్యకర్తలు కానీ, రాజకీయ పార్టీల కార్యకర్తలు కానీ ప్రశ్నిస్తే కేసుల పేరుతో భయపెడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతం మొత్తం ఇసుక మాఫియా తయారైంది. ఆన్‌లైన్ అనుమతులు లేకుండానే గోదావరి ఇసుక హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా తరలిపోతుంది. ఇసుక లారీలు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానాలకు చేరే వరకు వాహనాల్లో లారీ వెంట వస్తూ ఆపే అధికారులకు, పోలీసులకు ఫోన్‌లు చేయిస్తూ చెల్లింపులు చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దిపల్లి సొసైటీ అక్రమాలకు అంతే లేకుండాపోతుంది. గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక అధికారులు వారి అడుగులకు మడుగులొత్తుతున్నారు. గత ప్రభుత్వం ఇసుకాసురులకు స్వేచ్ఛనిచ్చింది. ఈ ప్రభుత్వమైనా ఇసుక అక్రమ రవాణాను నియంత్రిస్తుందని సొసైటీ నిబంధనలు అమలు చేయడం ద్వారా గిరిజనులకు లబ్ది జరుగుతుందని ఆశించారు. ఇప్పుడు పరిస్థితి గతమే నయమన్న చందంగా తయారవుతుందన్న ఆవేదన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం గోదావరి ఇసుక అక్రమ తరలింపుకు సంబంధించి గుత్తేదారుల పై వారికి సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుని పారదర్శకంగా ఇసుక తరలింపు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఐఆర్‌ఎఫ్‌ఎం డైరెక్టర్ జనరల్‌గా అపర్ణ గార్గ్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సివిల్ సర్వీసెస్ 1987 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ అధికారిణి అపర్ణ గార్గ్ ఇండియన్ రైల్వేస్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్‌ఎఫ్‌ఎమ్) డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ బాధ్యతలు స్వీకరించడానికి పూర్వం, అపర్ణ గార్గ్ బెంగళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీకి ప్రధాన ఆర్థిక సలహాదారుగా, మైసూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా, దక్షిణ రైల్వే, పశ్చిమ రైల్వే, నైరుతి రైల్వేలలో 35 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో పనిచేశారు. చెవెనింగ్ ఫెలో, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్ నుండి ట్రాన్స్‌పోర్ట్ ఎకనామిక్స్‌లో అడ్వాన్స్‌డ్ మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. దీనితో పాటు ఆమె మిలన్‌లోని బోకోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, సింగపూర్‌లోని ఐఎన్ఎస్ఇఎడి, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో కూడా శిక్షణ పొందారు.

# మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించాలి

### సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో మాకినేని వర్ధంతి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం జరుగుతోందని, పార్లమెంటు ఎన్నికల్లోనూ దానిని కొనసాగించాలని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. సిపిఐ(ఎం) అగ్ర నాయకులు మాకినేని బసవపున్నయ్య 32వ వర్ధంతి శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో నిర్వహించారు. బసవపున్నయ్య చిత్రపటానికి రాఘవులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ మాకినేని బసవపున్నయ్య (ఎంబి) బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికవాదం గురించి మౌలిక విషయాలను మాకినేని బసవపున్నయ్య రాశారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ బాబ్రీమసీదు తాళాలు తెరిపించి, హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చారని, కాంగ్రెస్ లౌకికవాద పార్టీ అయినపుడు ఆ పనిచేయాల్సిన అవసరమేంటన్న ప్రశ్న అందరిలోనూ వచ్చిందన్నారు. లౌకికవాదాన్ని కమ్యూనిస్టులు చూసే పద్ధతి, బూర్జువాలు, కాంగ్రెస్ పార్టీ చూసే పద్ధతికి తేడా ఉందని, అది జాతీయోద్యమం నుంచి ఉందన్నారు. అందుకే మతోన్మాదులపై పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డి.జి.నరసింహారావు, టి.జ్యోతి, టి.సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, బంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జె.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల వయో పరిమితిపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వయో పరిమితిని 61 ఏళ్లు లేదా 33 సంవత్సరాల సర్వీసు' అని వివిధ వార్త పత్రికలూ, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని అధికార వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఏవిధమైన ప్రతిపాదన కానీ, ఫైల్ నిర్వహణ లేదని స్పష్టం చేశాయి. ఈ విధమైన ఊహాజనిత వార్తలు రాయడం, దీనిని సామాజిక మాధ్యల్లో ప్రసారం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచురించే, ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ప్రభుత్వ అధికార ప్రకటనలో తెలిపారు.

# రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వడ్లను తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు, నష్టపోయిన మొత్తాన్ని ఆయా రైతుల బ్యాంక్ ఖాతాలో వేయాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎంఎల్‌ఎ గండ్ర వెంకటరమణరెడ్డి, మాజీ ఎంఎల్‌సి ఎం.శ్రీనివాస్ రెడ్డితో కలిసి పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ 500ల బోనస్ ఇవ్వక పోగా,కనీస మద్దతు ధరను కూడా దక్కనివ్వడం లేదని ఆరోపించారు. రూ500ల బోనస్ ఇచ్చి రూ. 2500లకు వడ్లను కొంటామని రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఎన్నో సార్లు సిఎం రేవంత్ ఆదేశాల తర్వాత కూడా రైతులు క్వింటాకు రూ. 700లు నష్టపోతున్నారన్నారు. ధాన్యం కేంద్రాలకు వెళ్లి మద్దతు ధర, బోనస్ కోసం ప్రభుత్వంపై రైతులు ఒత్తిడి చేయాలన్నారు. రైతులు మరింత నష్టపోక ముందే ప్రతి గింజను మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500ల బోనస్‌తో కొనుగోలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గండ్ర వెంకట రమణ రెడ్డి జనగామతో పాటు రాష్ట్రమంతా రైతులు దళారుల చేతుల్లో మోస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజలమధ్య కుల, ప్రాంతీయ చిచ్చుపెడుతున్న

# బిజెపిని పొలిమేరల వరకు తరిమికొడదాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

### కూనంనేని సమక్షంలో నలుగురు కౌన్సిలర్లు, తాజామాజీ సర్పంచ్ సిపిఐలో చేరిక





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం అనునిత్యం శ్రమించడమే కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, కమ్యూనిస్టు పార్టీ తరుపున గెలిచిన ప్రజాప్రతినిధుల ప్రధాన ఎజెండాగా ఉంటుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయం, శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, శ్రమైక జీవులకోసం ఆవిర్భవించింది సిపిఐ అని అన్నారు. ప్రజలను, ప్రజలకోసం పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలను ఎల్లవేళలా కంటికి రెప్ప లా కాపాడుకుంటామని, ఉద్యమాల ద్వారా మొద్దు నిద్రపోతున్న పాలకులను తట్టిలేపుతామన్నారు. రాబోయే పార్లమెంట్లు ఎన్నికల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన భాధ్యత కమ్యూనిస్టులపై ఉందని, తెలంగాణలోనూ, కార్పోరేట్‌కు ఊడిగంచేస్తూ, ప్రజలమధ్య కుల, ప్రాంతీయ చిచ్చుపెడుతున్న బిజెపిని దేశం పొలిమేరలవరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ సమావేశం సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు, ఫోర్ ఇంక్లెన్ జిపి తాజా మాజీ సర్పంచి, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి కూనంనేని సిపిఐ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి ప్రాధమిక సభ్యత్వాన్ని అందజేశారు. పార్టీలో చేరిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సేవలందించాలని, ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయడంతోపాటు అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజాపోరాటాల నిర్మించాలని తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సిపిఐలో చేరిన వారిలో కౌన్సిలర్లు మాచర్ల రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, నేరెల్ల సమైక్య, మాజీ సర్పంచ్ కాశీవిశ్వనాద్, పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, బొతు బాబూరావు, బొక్క శ్రీనివాస్, కర్రె వాసు, రామంచి శ్రీనివాస్, కుమారస్వామి, కుమార్, మద్దిపాక సుధాకర్, భూక్య లాలు, ఎండి. సుబాని ఉన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, కంచర్ల జమలయ్య, వి.మల్లికార్జున్‌రావు, జి.వీరస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, జక్కుల రాములు, నాయకులు ఎస్. వెంకటేశ్వర్‌రావు, నూనావత్ గోవిందు, జర్పుల ఉపేందర్, ధనలక్ష్మి, కిరణ్, మూడు గణేష్, తోట రాజు పాల్గొన్నారు.

# ప్రమాదంలో జర్నలిస్టుల జీవితాలు

### యువ ఫోటోజర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, సమయ పరిమితులు, తక్కువ వేతనాలతో జర్నలిస్టుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ 41 సంవత్సరాల చిన్న వయస్సులో మన మధ్య నుండి వెళ్లిపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఇటీవలే గుండెపోటుతో మరణించిన యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభ నిర్వహించింది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షత వహించగా కె. శ్రీనివాస్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి ఖాజా విరాహత్ అలీ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రధాన కార్యదర్శి శిగా శంకర్ గౌడ్, నర్రె రాజేష్ సతీమణి లావణ్య, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తరపున నర్రె రాజేష్ కుటుంబానికి లక్ష రూపాయల నగదు ఆర్థిక సహాయం అందజేసిన అనంతరం కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు తమ కెమెరాలలో బంధించడానికి ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని అన్నారు. వృత్తిలో ఉండే కష్ట నష్టాల గురించి పెద్దగా పట్టించుకోకుండా వారి చుట్టూ ఉన్న కఠినమైన వాస్తవాల చిత్రాలు ప్రపంచం ముందు ఉంచేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. హింసాత్మక సంఘటనలు చిత్రించే సమయంలో మరణించడం, గాయాలవడంతో పాటు వృత్తి ఒత్తిడితో ఫొటో జర్నలిస్టుల ఆరోగ్యాలు క్షిణిస్తున్నాయన్నారు. ఆయా పత్రికల్లో ఫొటో జర్నలిస్టుగా సేవలందించిన నర్రె రాజేష్, ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడని ఆయన కొనియాడారు. మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్ళు, చెవుల లాంటి వారన్నారు. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆ ఫొటోల కోసం ఫొటో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పాత్రికేయ వృత్తి అభద్రతా, అత్యంత ప్రమాదకరమైనట్లు ప్రజాస్వామిక దేశాలకు ఐక్యరాజ్య సమితి ఎప్పుడో సూచించిందని ఆయన గుర్తుచేశారు. నర్రె రాజేష్ భార్యకు పెన్షన్‌తో పాటు ఆయన పిల్లలకు విద్యనందించడానికి మీడియా అకాడమీ సహాయం అందజేస్తుందని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రాణాలను ఫణం గా పెట్టి మీడియా రంగంలో వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌యుజె అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ నర్రె రాజేష్ మృతితో తమ సంఘం క్రియాశీలక సభ్యుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, జెఎన్‌జెహెచ్ఎస్ అధ్యక్షులు బి. కిరణ్ కుమార్, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

### దేశ తొలి అంతరిక్ష యాత్రికుడు

# తోటకూర గోపీ తెలుగు కుర్రోడే



**విజయవాడ :** విజయవాడకు చెందిన తెలుగు కుర్రోడు తోటకూర గోపీ భారతదేశ మొట్టమొదటి అంతరిక్ష యాత్రికుడు కాబోతున్నాడట! గోపీ వయసు 30 సంవత్సరాలు. అతగాడికి అంతరిక్షం అంటే బాల్యం నుండీ ఎంతో ఆసక్తి. ఏరోనాటికల్ సైన్స్‌లో పట్టా తీసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ విజయవాడలో జన్మించిన తోటకూర గోపీ అమెరికాలో 98 ఏళ్ళ క్రితం స్థాపించిన ప్రపంచ అగ్రశ్రేణి ఎంబ్రిరిడిల్ ఏరోనాటికల్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. ఒక పైలెట్‌గా బ్లూ ఆరిజన్ న్యూ షెపర్డ్ అంతరిక్ష యాన సభ్యుల్లో ఒకడుగా ఎన్నికయ్యాడు.ప్రస్తుతం ఆయన ప్రిజర్వ్ లైఫ్ కార్పొరేషన్ సంస్థను నడుపుతున్నాడు. హార్ట్స్‌ఫీల్డ్ జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈ సంపూర్ణ ఆరోగ్యానికి సంబంధించిన ఒక గ్లోబల్ సెంటర్‌గా ప్రిజర్వ్ లైఫ్ కార్పొరేషన్ రూపుదిద్దుకుంటున్నది. "గోపీ ఒక పైలట్, ఎవియేటర్, ఆయన విమాన ఎలా నడపాలో నేర్చుకున్నారు, ఆయనకు అంతరిక్ష యానం ఒక కల, సీ ప్లేన్స్, గ్లైడర్స్, హాట్ బెలూన్స్,ఏరోబాటిక్‌లు నడుపుతాడు. ఇంటర్నేషనల్ మెడికల్ జెట్ పైలెట్‌గా పనిచేశాడు. ఆయన జీవితకాల ట్రావెల్లర్, మౌంట్ కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించి ఇటీవల ఆయన రికార్డు సృష్టించాడు.యువకుల ఆశయాలు నెరవేర్చడంకోసం ఏర్పాటు చేసిన బ్లూ ఆరిజిన్ ఫౌండేషన్‌లో సభ్యుడు. 1961లో జాన్ ఎఫ్ కెన్నడీ ఎంపిక చేసిన మాజీ వైమానికదళ కెప్టెన్ ఎడ్వర్డ్ డ్వైట్‌తో గోపీ జత కలిశారు. బ్లూ ఆరిజన్స్‌కు చెందిన న్యూ షెపర్డ్‌ను అలన్ షెపర్డ్‌గా నామకరణం చేశారు. న్యూ షెపర్డ్స్ అనేది రాకెట్లను పునర్వినియోగం చేగల సామర్థ్యంగల సంస్థ. వ్యోమగాములను, రీసెర్చ్ పేలోడ్స్‌ను రవాణా చేయడంలో ఈ సంస్థ దిట్ట. ఇది తలపెట్టిన ఈ సాహసకార్యం మరపురాని కార్యక్రమం కాబోతున్నది'' అని బ్లూ ఆరిజన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఈ సమాచారాన్ని పంచుకుంది.

# భావితరాల మార్గదర్శకుడు పూలే

### ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదాం : బోస్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లటమే ఆయనకు సమర్పించే నిజమైన నివాళని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. జ్యోతిరావు 197 వ జయంతి పురస్కరించుకొని ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కుల, వర్ణ వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త భావి తరాలకు మార్గదర్శకుడన్నారు. సమాజంలో వివక్షతకు తావు లేదని, సమానత్వం ద్వారానే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్న లక్ష్యంతో ఆయన విశేషమైన కృషి చేసారన్నారు. వెనుక బడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకొన్న బాట, అనుసరించిన మార్గం నేడు సమాజ కాంక్ష కోరుకొనే వారికి స్ఫూర్తి అన్నారు. స్త్రీలు సైతం విద్యావంతులవ్వాల్సిందే అని చెప్పటంతో పాటు ముందుగా ఆయన భార్య సావిత్రి బాయిని పాఠశాలకు పంపి ఆదర్శంగా నిలిచాడన్నారు. అన్ని కులాల వారు చదువుకొనేందుకు గాను ఆయన స్వయంగా పాఠశాలను స్థాపించి ఆశయాలకు అనుగుణంగా నడిపించావర్నారు. వితంతువులైన మహిళలకు పునర్వివాహాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిని ఓడిస్తేనే దేశానికి రక్షణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

### వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు



**ప్రజాపక్షం/హనుమకొండ:** రాజ్యాంగం రక్షింపబడాలన్నా, ప్రజాస్వామ్యం పరిరక్షించాబడాలన్నా కేంద్రంలో బిజెపిని సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లాలోని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ జిల్లా సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం, ఎంసిపిఐ(యు), ఆర్ఎస్‌పి, న్యూడెమోక్రసీ నాయకులు ఎం. చుక్కయ్య, కె. శివాజీ, ఆర్. బాలరాజు తదితరులు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే దేశం, ఒకే చట్టం అంటూ ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. నేడు దేశంలో అవినీతి పరులంతా బిజెపిలోనే ఉన్నారని, విపక్షాల నాయకులను ఇడి, సిబిఐ, ఐటిలను ప్రయోగించి లొంగదీసుకుని బిజెపిలోకి చేర్చుకుని క్లీన్ చిట్ ఇస్తున్నారని అన్నారు. బిజెపి ఉమ్మడి వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో నిధుల కేటాయింపులో వివక్ష చూసిందని, విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు నెరవేర్చలేదని, విద్యుత్‌ను కూడా ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బిజెపిని ఈ ఎన్నికలలో ఇంటికి సాగనంపాలని కోరారు. ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపి ప్రజల మౌళిక సమస్యలు పరిష్కరించలేక మతోన్మాద ఎజెండా ఎత్తుకున్నదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ఈ సదస్సులో సిపిఐ, సిపిఎం, ఎం సిపిఐ, మాస్‌లైన్, లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్, ఎస్‌యుసిఐ, ఎంఎల్‌పిఐ నాయకులు దొంతి రాజేష్, గంగుల దయాకర్, రొయ్యల రాజు, రాచర్ల బాలరాజు, కె. శివాజీ, ఎన్. రవీందర్, కుమారస్వామి, భాస్కర్, రమేష్, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

# రిసోనెన్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ బోర్డ్ గుర్తింపు లేకుండా, బోర్డ్ అధికారిక అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడకముందే అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న హిమాయత్ నగర్‌లోని రిసోనెన్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని కళాశాలలకు వత్తాసు పలుకుతున్న ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని రీసోనెన్స్ కళాశాల ముందు ధర్నా నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పంచుతున్న కరపత్రాలను, అడ్మిషన్ ఫామ్‌లను దగ్ధం చేశారు. ధర్మేంద్ర, శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్య మండలి గుర్తింపు పొందకుండా కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు విచ్చలవిడిగా నడుస్తున్నాయని విమర్శించారు. నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు అనుమతులు ఉన్న కళాశాలలోనే చేరాలన్నారు. కానీ, కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు మంజూరు కాని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 2024/25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్‌ల ప్రక్రియను ప్రారంభించాయని, ఇప్పటికే 10వ తరగతి విద్యార్థుల డేటాను కార్పొరేట్ కళాశాలలు అడ్డదారుల్లో సేకరించి విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి పిఆర్‌ఓలు, అక్రమంగా అడ్మిషన్ ఫీజుల పేరిట 3 వేల నుండి 10 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇంటర్ బోర్డ్ అడ్మిషన్‌ల ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్‌ను మే నెలలో జారీ చేస్తుందన్నారు. కానీ కార్పొరేట్ కళాశాలలు నిబంధనలు ఉల్లంఘించి, ఇప్పుడే అడ్మిషన్లు చేపడుతున్నారని చెప్పారు. తక్షణమే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారి స్పందించి గుర్తింపు లేకుండా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న హిమాయత్ నగర్‌లోని రీసోనెన్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని జూనియర్ కళాశాలల జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారులు తమ బాధ్యతలను మరచి కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. అనధికార కళాశాలలను కట్టడి చేయాల్సిన అధికారులు ఆయా కళాశాలల తాయిలాలకు ఆశపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

**ఒడ్డెన్న హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వివరణ**

హిమాయత్ నగర్‌లో ఉన్న రీసోనెన్స్ కళాశాలకు ఇంటర్ బోర్డ్ ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని, ఇప్పటికే సదరు కళాశాలకు నోటీసు ఇచ్చామని, ఎటువంటి జవాబు ఇవ్వలేదని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి తెలిపారు. మరల నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారని సమాచారం అందిన నేపథ్యంలో, ఈ కళాశాలను మూసివేస్తున్నట్లు, నేటి నుండి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని, నిర్వహిస్తే కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# కాంగ్రెస్ వన్నీ ఉద్దెర మాటలు

### మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ హరీష్‌రావు ఎద్దేవా



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన్నీ ఉద్దెర మాటలని తేటతెల్లమయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఎద్దేవా చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్‌కు కరీంనగర్ పుట్టినిల్లు లాంటిదని, పదేళ్ల పాలనలో కరీంనగర్‌లో ఎనలేని అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 32 రాజకీయ పార్టీలను ఒప్పించడంలో వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అర్హత లేకున్నా కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తెచ్చిన ఘనత వినోద్ కుమార్‌దేనన్నారు. గత ఐదేళ్లలో ఎంపిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. కనీసం మెడికల్ కాలేజీ, నవోద పాఠశాల సైతం తేలేదన్నారు. పేదల కోసం చేసింది చెప్పమంటే క్యాలెండర్లు, చిత్రపటాలు పంచుతున్నారని, అవి పేదల ఆకలి తీరుస్తుందా? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పదేళ్లలో చేసిందేమిటని ప్రశ్నించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి విస్మరించిందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం నిండు అసెంబ్లీ సాక్షిగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ , బిజెపిలకు ఓటేస్తే ప్రజలు మోసపోతారన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ బిజెపి ఒక్కటయ్యాయని, బడే భాయ్, చోటే బాయ్‌లాగా చీకటి ఒప్పందం చేసుకున్నాయన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మేయర్ సునీల్‌రావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, బిఆర్ఎస్ కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుకూల వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌కమ్ ట్యాక్స్, సిబిఐ, విజిలెన్స్ పేర్లతో మోడీ ప్రజలను బెదిరిస్తున్నారని అన్నారు. తమ పార్టీలో అవినీతిపరులు ఉంటే, వారు బిజెపిలో చేరిన వెంటనే మంచివారు అవుతారా? అని నిలదీశారు.అందుకే తాను మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను భారీ వాషింగ్ మిషన్‌లు అని తరచూ అంటుంటానని, అందులో దుస్తులనే కాకుండా మనుషులను కూడా శుభ్రం చేస్తారని, బిజెపిలో చేరిన వారు పరిశుద్ధులు అవుతారని ఖర్గే ఎద్దేవా చేశారు. అప్పటి వరకు తమ పార్టీలో ఉన్న వారిపై కేసులు పెట్టారని, వారే బిజెపిలో చేరిన వెంటనే ఎలా మంచి వారవుతారని ప్రశ్నించారు. అవినీతిపరులను వదిలిపెట్టబోనని మోడీ అంటారని, కాని ఆయన వెంట అలాంటి వారే కూర్చుంటున్నారని, అవినీతిపరులను వెంట ఉంచుకొని మోడీ పరిపాలన సాగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష పార్టీలో ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరుస్తున్నారని, కర్నాటక, మహారాష్ట్ర, గోవా, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలలో ఆ పని చేశారని, ప్రతి చోటా పార్టీలను ధ్వంసం చేసి బిజెపి ప్రభుత్వాలనే ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ, అమిత్ షాలు అవలంభించే ప్రజాస్వామ్య సూత్రాలు ఇవేనని ఎద్దేవా చేశారు.

**మా గ్యారంటీలను కాపీ చేసిన మోడీ కాపీ :** తాము కర్నాటలో ఐదు గ్యారంటీలను వాగ్దనం చేసి , అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామని, మోడీ ఇప్పుడు మా గ్యారంటీలను కాపీ కొడుతున్నారని ఖర్గే ఆరోపించారు. ప్రతి చోట ఆయన 'మోడీ కీ గ్యారంటీ' అంటున్నారని, ఆయన గ్యారంటీ ఎక్కడ అని ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com